రామాయణం

# భరతుడు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!



మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


భరతుడు

శ్రీ

# భరతుండు

( తేక )

## పట్టాభిషేక భంగము

★

*Approved for Class use for Nondetailed Study*
*for Higher Forms*

**Fort St. George Gazette Supplement I-B**

**MAY 14 - 1946**

[illegible]

[illegible]


బ్ర॥ శ్రీ, దుర్భా-సుబ్రహ్మణ్య శర్మగారిచే


[illegible]

★


**VADLAMUDI RAMAIAH,**
EDUCATIONAL PUBLISHER,
NELLORE.

[illegible] ] [ [illegible] 0-12-0

# పీఠిక

రామాయణములోన లేని నీతులుగాని ధర్మోపదేశములుగాని లేవు. మఱియు నవి కేవలములు గాక, యత్యుత్తమ కథాసంవిధానముతోడ సంబంధపడి యుండుటనుబట్టి, పాఠకులయొక్కయు, శ్రోతలయొక్కయు హృదయముల కప్రయత్నముగ నెక్కుశక్తిగలిగి వెలయుచున్నవి. రాముని సత్యసంధత. సీత పాతివ్రత్య మిత్యాదు లాబాలగోపవిదితములు. ఈ మహా పాత్రల యద్భుతప్రకాశము నెదుర, ఇంచుమించుగఁ దుల్యములైన యితర పాత్రల సుచరితములు దివ్వియలదరి దీపములవలె నగుచున్నవి. ఇట్టి పాత్రములలో భరతుఁడొక్కఁడు. ఈయన శీల మతిలోక సౌభ్రాత్ర సంపన్నము. ఈయన సుచరితము రామాయణములోని యే పాత్రముయొక్క సుచరితమునకును వెనుకఁబడునది గాదు. బాలుర యుద్బోధముకొఱ కీయననుగూర్చి సులభమైన దొక్క వచనగ్రంథము వ్రాయవలయునని చిరకాలముక్రింద నాకు స్ఫురించియుండెను. కాని తీఱిక లేమిఁజేసి నేఁటి వఱకు నప్పని యొనర్పఁజాలనైతి. ఈ పుస్తకమును జదివి, ప్రపంచయాత్రలోఁ గుటుంబ సౌఖ్యమున కావశ్యకములైన విషయములలో నొక్కటియైన భ్రాతృభక్తిని, ఆంధ్రబాలురు కొంతయైన నలవరించుకొందురేని నా ప్రయాసము సఫలమయ్యె నని తలంచెద.

దుర్భా-సుబ్రహ్మణ్య శర్మ.

శ్రీ

# భరతుఁడు

## ప్రథమాధ్యాయము

పూర్వకాలమున నయోధ్యాపట్టణమును దశరథుఁడను రాజు పాలించుచుండెను. ఆ ఱేనికిఁ గౌసల్యయనియు సుమిత్ర యనియుఁ గైకయనియుఁ గుణశీల రూపయుతలైన భార్యలు మువ్వురుండిరి. సకలైశ్వర్య సంపన్నుఁడయ్యు, నన్న రేశ్వరుఁడు చిరకాలము పుత్త్రసంతానము లేకునికికి ఖిన్నుఁడై గురుజనుల యుపదేశమువలనఁ బుత్త్రకామేష్టి యను యజ్ఞమును గావించి తత్ఫలమ్ముగఁ గౌసల్యవలన శ్రీరాముని, సుమిత్రవలన లక్ష్మణ శత్రుఘ్నులఁ, గైకవలన భరతుని, బుత్త్రులుగాఁ బడసెను. నృపకుమారకుల మను గర్వ మిసుమంతయును లేక, యీ బాలకులు పెద్దలయెడ గౌరవమును, సమానులయందు సౌహార్దమును, బీదసాదలయందుఁ గరుణయుఁ గలిగి తండ్రికి మిగులఁ బ్రియులై వినయ సౌశీల్యాది సుగుణసంపత్తితోడ వర్ధిల్లుచుండిరి. వీరిలోఁ బెద్దవాఁడైన రాముఁడు యుక్తకాలమున రాజకుమారకులకుఁ గావలయు

ధనుర్విద్యాది విద్యలన్నిటిని గ్రహించి, మిథిలాపురాధీశ్వరుఁ
డైన జనకమహారాజు తన కుమారిక వివాహ విషయమున
నుంకువగా విధించిన శివధనుర్భంగమును గావించి సీతాదేవిని
పెండ్లియాడెను. తుల్యసత్త్వశీలురగు తమ్ములును జనకుని
యితర కుమారికలను పెండ్లియాడిరి.

దశరథుఁడు సూర్యవంశపు రాజులందఱవలె నెల్ల
దెసలఁ గడుఁగడిమికలవాఁడయ్యును, లేక లేక వృద్ధదశయందు
గలిగిన కుమారకులు కావున, రామాదులమొదల నగ్గలపు
గారవముగలిగి, వారిక్షేమమునుగూర్చి మిగుల భయశీలుఁడై
యుండెను. కొడుకులు యౌవనస్థులై తమ కాంతలతోడి
కాఁపురముచేయుచున్నను, వృద్ధనృపతి తన తనయుల సేమము
నేమఱక వారు గావింపఁదగిన కార్యములుగూడఁ దానగుమన
రించుచుఁ గంటిని రెప్పవలె వారిఁగాపాడుటయందును జాగరూ
కుఁడై మిగుల మోహమునఁ బ్రవర్తిల్లుచుండెను. ఈ
రాకొమరులు నిసర్గశౌర్యమునఁ గావించు కొన్ని కొన్ని
కార్యములు నితనికి భయహేతువులై యుండెను. వేఁటకేఁగి
వారు మరలి వచ్చుట కొక్కొకప్పుడు ఆలస్యమైన, నది
దశరథున కొక్కొక యుగముపోలెఁదోఁచుచుండును. తురంగా
రోహణాదులయందును, మల్లశాలలయందును ఈ కుమారులు
చూపు శక్తిసాహసముల కితఁడు వెఱఁగుపడుచుండు, వీరిఁగాపా
డుటకు వేయివేల్పులకు మ్రొక్కుచుండు. వృద్ధాప్యమునకు

బూర్వము, రామచంద్రుని విశ్వామిత్రుని వెంటఁ బంపవలసి వచ్చినప్పుడు, దశరథునకుఁ గలిగిన సంతాపమునకుఁ బారము లేదు. శ్రీరాముఁడు తాటకామారీచులను పరిభవించుట మిథిలలో వివాహసమయమునఁ గౌశికునివలనవినియు, నావల నయోధ్యకు వచ్చుదారిలో రామచంద్రుఁడు పరశురాముని నోడించుట ప్రత్యక్షముగఁ జూచియు, దశరథుఁడు తన కుమారులు కన్నులుదెఱవని చిన్నపాపలనియే తలంచుకొనుచుండెను. తల్లిదండ్రులకు బిడ్డలయెడ నుండు వాత్సల్యము వర్ణనాతీతము గదా! అట్టి పితౄణమును బుత్త్రుఁడేమి సేసి తీర్చుకొనఁగలఁడు?

రామచంద్రుఁ డిప్పటి కెల్లవిధముల సామ్రాజ్యమునకు వచ్చుట కర్హుఁడుగా నుండెను. బలపరాక్రమాదులయందును, రాజనీతి నైపుణ్యమునను, బ్రజాభిప్రాయ పరిజ్ఞానమందును, ఆతఁడు తండ్రికన్న మిన్నయై పౌరజనుల యనురాగమునకుఁ బాత్రుఁడై వెలయుచుండెను. నానాఁట వార్ధక మలముకొను కొలఁది, దశరథుఁడు రాజ్యమును రామచంద్రునికిచ్చి తాను సుఖముగనుండవలయునని తలఁచుచుండెఁగాని, 'పసికూనకీతని కీలోన యీ భారము తలఁబెట్టనేల? నిర్విచారులై కుమారులు సుఖముండుఁగావుత. ఈ భారమును నేనే యింకఁ గొన్ని దినములు వహించెదను' అని యా మాట త్రోసివేసికొనుచుండెను. కౌసల్యయు దశరథునితోడఁ 'కుమారులు పెద్ద

వారయిరి. రాజకార్యములు వారు నిర్వర్తించుకొనఁగలరు. పెద్దతనమును నింకను మీకీ ప్రయాసమేటికి?' అని యప్పటప్పటికి బోధించుచుండెను. కాని పుత్రస్నేహమునఁ జేసి, కష్టములకెల్లనోర్చి దశరథుఁడే యఖండమహీమండల పరిపాలనము గావించుచుండెను. ఇట్లు కొంతకాలము జరుగఁగా దశరథున కిఁకఁ దాను రాజకార్యములు చక్కఁగా నిర్వహింపనేరనను భయము దోఁచెను. అతఁడు మంత్రులతోను సామంతులతోను రాజ్యమందలి ప్రజలతోను నాలోచించి రామునకుఁ బట్టాభిషేకము సేయ నిశ్చయించి, రామచంద్రుని మంతనమునకుఁ బిలిపించుకొని "నాయనా! నన్ను జరాభరము గ్రమ్ముచున్నది. అనేక సంవత్సరములనుండి రాజ్యమును వహించిన నా భుజమున పటుత్వము సన్నగిల్లుచున్నది. కార్యముల దెస నాకుజ్ఞప్తియుఁ దగ్గిపోవుచున్నది. ఇఁక నీ సామ్రాజ్యభారమును నేను వహింపఁజాలను. అనేక సంవత్సరములు బ్రతికి యనేకములైన యజ్ఞములఁజేసి సర్వకామములను సంపూర్ణముగా ననుభవించితిని. నాకు మనస్సులో నొక్క కొఱంతయును లేదు. నిన్ను యువరాజుంగావించి చూడవలయునను కోర్కె దక్క వేఱేదియును లేదు. నీవు రాజ్యమునకువచ్చుట ప్రజలకెల్ల మిగుల నభీప్సితముగానున్నది. నీవు నామాట కాదనక యీ రాజ్యమును బరిగ్రహింపవలయును. ఇట్లు నిన్ను వేగిరించుటకు నితర కారణము

లును గలవు నాకుఁ గొన్నిదినములుగా నిద్రపట్టకున్నది. దుస్స్వప్నములగుచున్నవి. గ్రహచారవిదులగు జ్యోతిష్కులును నాకిప్పుడు మంచి దినములు కావని వచించుచున్నారు. ఈ దుర్నిమిత్తముల వలన నాకు మరణమో లేక యితరమైన యమంగళమో వాటిల్లునని తోఁచుచున్నది. శరీరములు శాశ్వతములు కావుగదా! నా కన్నులయెదుట నిన్ను యౌవ రాజ్యమున కభిషిక్తునిగాఁ జేసి యాయానంద మనుభవింప వలయునని యున్నాఁడను. నేఁడు పునర్వసు నక్షత్రము. రేపు పుష్యమి. రేపటిదినము నీవు రాజ్యము గ్రహించుటకు బాగుగా నున్నదని వసిష్ఠుఁడు మొదలగు పెద్దలు చెప్పినారు. ప్రయత్నములును జరుగుచున్నవి. నీవు నామాట కెదురాడక యియ్యభిషేకమునకొప్పుకొనవలయును. నీవునుసీతాదేవియు నేఁటిరాత్రి యుపవసించి రేపు పట్టాభిషేకమహోత్సవము నకు సిద్ధపడవలయును. ఇదిగాక, నామనస్సులో నింకొక యభి ప్రాయమున్నది. భరతుఁడు తన మేనమామ యింటికిఁబోయి యున్నాఁడుగదా! అతఁడు రాకమున్నే యీకార్యము జరుగ వలయు, ఏలన, మనుష్యుల సంకల్పము లెఱుంగరాదు. ఏవేళకు నెట్టి బుద్ధిపుట్టునో యెవరు చెప్పఁగలరు? అతఁడు ధర్మమార్గవర్తియగుట నిజము. ఐనను, ఏలోకో యాతని విషయమున నాయుల్లము సంశయముపాలగుచున్నది. దీనిఁ గూర్చి నీయభిప్రాయమెట్లున్నను, రేపటి మహోత్సవము

నను నీ వాయితపడవలయును" అని చెప్పి రామచంద్రుని తన మాట కొప్పుకొనునట్లు చేసెను.

ఈశుభవార్త తెలియఁగానే సహజముగానే మిక్కిలి రమణీయముగానుండు నాయయోధ్యాపురము క్షణకాలములో నపూర్వశృంగారములతోడ నమరావతీపురమును బురుడించుచుండెను. రామచంద్రుని యనుమతికై యెదురు చూచుచున్న ప్రజ లీ శుభవార్త చెవుల సోఁకఁగానే తమ గృహంబుల నెల్ల నలంకరించుకొని సూర్యోదయమున కెదురు చూచుచుండిరి. ఎక్కడఁ జూచినను మంగళవాద్యనిస్వనములే. ఎక్కడను రంగవల్లులే. ఎక్కడను దోరణములే. ఆరాత్రి పట్టణములో నిద్రపోయినవారు లేరు. రామచంద్రుని గుణముల నొండొరులతోడఁ జెప్పుకొనువారును, సీతాదేవి సౌశీల్యము ప్రశంసించువారును, దశరథుని గుణకథనము చేయువారునై కార్యములు మఱచి యెల్లరును 'ఎప్పుడెప్పుడు ప్రొద్దుపొడుచునా? ఎప్పుడు పట్టాభిషేకము వర్తిల్లునా? చూతం' మని తహతహ పడుచుండిరి.

# ద్వితీయాధ్యాయము

ఒక కార్యమునుగూర్చి తీవర పడువారికి నిమిష మొక్కయేఁడుగాఁదోఁచునుగదా! పౌరులు రాత్రిగడియలనెట్లో గడుపుచుండిరి. వేకువ కావచ్చెను. ఆకాశమున సందులేక నిండియున్న నక్షత్రములెల్ల నదృశ్యములై యెక్కడ నక్కడ నొకొక్కచుక్క గాన్పించుచుండెను. అదియును బ్రకాశమును గోల్పోయి క్రమముగా నంతర్ధానమగుచుండెను. అరుణోదయమైనది. కౌసల్యయొక్కయు, సుమిత్రయొక్కయు సౌధము లలంకార భరితములై కన్నులపండువు గావించుచుండెను. దాసీజనులు సరభసముగా వచ్చుచుఁబోవుచుండిరి. కైక యొక్క మేడ యొక్కటిమాత్ర మెప్పటివలె నుండెను. ఓహో! ఏమిది? కైకకు రాముని పట్టాభిషేకమన్న నయిష్టమా? కాదు. దశరథుఁడు కైక కీవార్త తెలిసిన విఘ్నమాచరించునని దీనిఁ దెలుపవల దనియెనా? కాదు. కైక, ముగ్గురు భార్యలలోను దశరథునకు మిక్కిలి ప్రియురాలు. రామునకుఁ గడుఁ గూర్చునది. ఈశుభోదంతమును దానుగానే కైకకుఁ జెప్పి యద్దేవివలన మన్ననలు వడయువాఁడై దశరథుఁడీవార్త పరిచారికలచేతఁ జెప్పిపంపఁడయ్యె. అందుకొఱకే కదా యతఁడిప్పుడు వఱువాత లేచి సంధ్యాకృత్యములు దీర్చి యుచిత వేషముతోడఁ గైకేయిసౌధమునకు వచ్చుచున్నాఁడు. ఈ సమయమున దశరథుని మనస్సులోని సంతోష మనర్గళ

ముగా నుండెను. ఇట్టి సంతోషము నింతకుమున్నతఁ డనుభవింపలేదు. ఇఁకముందేమైన ననుభవించునో! ఎవఁడు చెప్పఁగలఁడు? దైవసంకల్పములు గూఢములు గదా !

మంథరయనునది కైకయొక్కదాసి. దీని జన్మస్థానమేదియో, తల్లిదండ్రులెవ్వరో యెవ్వరికిని దెలియదు. కైకకే తెలియదు. తన బంధుగులయిండ్లలో దాసిగానున్న దీనిని కైకయత్తవారియింటికి వచ్చునపుడు కూడఁ దోడ్కొని వచ్చెను. ఇది పరిచారికయయ్యు నెట్లో కైకయొద్ద మిక్కిలి విశ్వాసము సంపాదించికొని యామెకు బహిఃప్రాణమువలె నుండెను. ఈ దినము మంథర యెప్పటివలెఁ దన యజమానురాలికన్న ముందుగా నిద్రలేచి కన్నులు పులుముకొనుచు మేడయొక్క పురోభాగమునకువచ్చి యిటునటు పట్టణమువంకఁజూచి, ధ్వజపతాకాదులతోను, మంగళచిహ్నములతోను సర్వత్ర అలంకృతమైయున్న పురవీథులనుఁగాంచి యాశ్చర్యపడి క్రిందికివచ్చి, కౌసల్యయింటికి వడివడిగాఁ బోవుచున్న యొక్క చెలికత్తెనుగాంచి యీ శృంగారములకెల్లఁ గారణమేమియని యడిగెను. ఇంత ప్రసిద్ధమైన యుదంతము నెఱుంగమికి నాచేటిక మంథరనపహాసించి శ్రీరాముని పట్టాభిషేకవిషయము సంక్షేపముగాఁ జెప్పి తనత్రోవను దానుబోయెను. ఈ యపహాస్యమువలన నే కోపమువచ్చెనో, కాక రామచంద్రునియెడ నీవఱకే మంథరకుఁ గోపముండెనో యెవ్వరును జెప్పనేరరు. కాని రాముని

పట్టాభిషేకవార్త చెవి సోఁకఁగానే మంథర కెట్లైన నాపని కాకుండఁ జేయవలయునని దృఢమైన నిశ్చయము గలిగెను. ఎట్లయినను, మంథర నింద్యురాలే. తనకుఁ బట్టాభిషేకవార్త ముందుగాఁ దెలియలేదన్న కినుకతో దానికివిఘ్నము గలిగింప వలయునని తలఁచియున్నఁ దనయధికారమేమి? పొట్టకూటికై కైకేయినాశ్రయించిన నీచజాతివనిత. రాజకార్యములుతనకుఁ దెలియనే వలయునా? అటుగాక రామచంద్రునెడ నీవఱకే ద్వేషమున్నయెడల, నతఁడు లోకోత్తర గుణరత్న రత్నాకరుఁడు. ఎద్దియేని యన్యాయమున్నయెడల;మంథరను శిక్షించి యుండుఁగాని యూరక శిక్షించియుండఁడు. మాకుఁజూడ నీ నిర్భాగ్యురాలు మేలోర్వఁజాలనిది. ఇట్టి స్వభావము లోకములోఁ గొందఱకుఁగలదు. ఒరులకు మేలుసంఘటిల్లు నవసరములఁ గొందఱది తమమేలుగాఁ దలఁచి సంతోషించుచుండఁగాఁ గొందఱు చూడలేక లోలోపలఁ గుములుచుందురు.

'క. పరుల ప్రధానమునను విద్యా
పరిణతికిని ధనమునకు బలమునకును మనం
బరయఁగ నసహ్యపడు న
న్నరుఁడు తెవులులేని నొప్పిఁబడు నధిపా!'

యని భారతి ముగ్గడించుచున్నది.

ఈ వార్త చెలికత్తియ చెప్పఁగానే, మంథర త్వరితగతి మేడమీఁదికిఁ బోయెను. అక్కడఁ గైక యింకను సుఖముగా శయనించియున్నది. పాపపుఁదలంపులులేని సుచరిత్రల

కెట్టి సుఖనిద్రిఘటిల్లునో యట్టి సుఖనిద్రినుండి కైకేయి యింకను లేవలేదు. మంథర చివాలునఁ బోయి కైకను నిద్రినుండి లేపెను.

కైక—ఏలనన్నిట్లు మేల్కొల్పుచున్నావు. ఇంకనుజక్కఁగాఁ దెల్లవాఱలేదు. (గవాక్షమునుండి యాకసమునఁబరికించి) అవిగో! నక్షత్రములుగూడ నన్నియు నంతరింపలేదు.

మంథర:— తెల్లవాఱలేదా ? తెల్లవాఱినది- అంతయుఁ దెల్ల వాఱినది - రాజ్యము - భోగము - అన్నియు

కైక :—నీమాటలు నాకర్థముకాలేదు. ఏమివిపత్తువచ్చినది? ఏల యుదయముననే యిట్టికాఱులు పేలుచున్నావు ?

మంథర:— కాఱులా ? కావు, కారలు- కారాగృహములు,

కైక:— (లేచికూర్చుండి)ఏమీ? కారాగృహములా ? ఎవ్వరికి ! నీ వక్రోక్తి చాలించి యథార్థము వచింపుము.

మంథర :— విపత్కాలమున మంచిమాటలును వక్రోక్తులుగాఁ దోఁచును.

కైక:— కారాగృహములంటివే, ఎవరికి ?

మంథర; — నీకును - నీకొడుకునకును.

కైక:— ఛీ ! అప్రియదర్శినీ ! ఏమి మాటలాడుచున్నావు ? మారామభద్రుఁడు సుఖంబుండఁగా నెవ్వఁడీయప్రియము మాకొనర్పఁగలఁడు ?

మంథర:— లేచి పురమువంకఁజూడుము! ఎట్టియలంకార ములో! ఎట్టి పచ్చతోరణములో! ఎట్టి ధ్వజపతాకాదులో!

కైక:— ఐన నేమి? ఇవన్నియు మంగళోన్నతిని సూచించునుగాన వానిఁగూర్చి భయపడవలసిన దేమున్నది?

మంథర:— ఏమియు లేదు. నీవును నీకొడుకును సుఖమున్న నివన్నియు నుండవలసిన వే.

కైక:— మాకు సుఖముగాక యేమి కొఱత? ప్రాణేశ్వరుఁడు దశరథుడును, కుమారరత్నము రామచంద్రుడును సుఖముగానుండగా!

మంథర:— ఆ రామచంద్రుఁడే యిన్నియనర్థములకు మూలము.

కైక:— (కోపముతో) నీయధిక ప్రసంగము లిఁకఁ జాలింపుము. రఘుకులాలంకారుని - రామచంద్రునే - యధిక్షేపించుచున్న దానవు?

మంథర:— కైకా! నీవెంత ముగ్ధురాలవు. జరుగుచున్న కృత్రిమ వ్యాపారముల నెఱుఁగక, హితోపదేశము చేయవచ్చిన నన్నే, యిట్లు విదిలించి వైచుచున్నావు.

కైక:— నీవన్నమాట నాకుఁ దెలియకున్నది, రాముఁ డేమైన నాకపకారముదలచెనా?

మంథర:— కాదు, దశరథుఁడే.

కైక:—నమ్మజాల. నాప్రాణేశ్వరుఁడు నాకపకారము నుదలఁచె నన్నమాట యెన్నఁటికిని నమ్మజాల.

మంథర:—ప్రాణేశ్వరుఁడు! ఔను- ప్రాణముల కీశ్వరుఁడు గనుకనే - వానిందీయ నిశ్చయించెను.

కైక:—దశరథుఁడు నాప్రాణములఁ దీయ నిశ్చయించెనా?
మందరా:— ! నీకు నిక్కముగాఁబిచ్చిపట్టినది.

మంథర:—నాకుఁగాదు. నాయజమానురాలవైన నీకే కుమర్ప్రాని పిచ్చిపట్టినది. కాకున్న రామచంద్రునిదెస నిట్టి ప్రీతిని నింతువా? రేపు - రేపుకాదు నేఁడే - రామచంద్రుఁడు పట్టాభిషిక్తుఁడై నిన్నునునీకొమరుని రాజ్యము నుండి వెడలఁదఱిమెనేని...

కైక:—మంథరా! నీయభిప్రాయము నాకుఁదెలిసినది. శ్రీరాముని యౌవరాజ్యమున కభిషిక్తునిఁజేయ దశరథుఁడు నిశ్చయించెఁగాఁబోలు. ఇంతమాత్రమున నీకేల యిట్టి యుదరిపాటు? ఆరామచంద్రుని స్వభావగుణము లెఱింగియు నిట్టులన నీకు నోరెట్టులాడె? ఎట్టి పితృభక్తి! ఎట్టి భ్రాతృవాత్సల్యము ఎట్టికరుణ! ఆరామచంద్రుని దలఁచుకొన్న నామనస్సుప్పొంగుచున్నది ఆ రాముఁడొకఁడు ఈభరతుఁడొకఁడునా? పిచ్చిదాన! నాయందుఁ గల ప్రేమాతిశయము నీకిట్టిసందేహము కల్గించెనేమో కాని యాతని పట్టాభిషేకవార్త తలఁచుకొన్న నామనస్సానంద

నుచేఁ బరవశమగుచున్నది. పోనీగాని, ఈపట్టాభిషేక వార్త యెవ్వరికిని దెలియదే. నీకుమాత్రమెట్లు తెలిసినది?

మంథర:— ఎవ్వరికిని దెలియదా? ఊరనున్న కైకకును, ఊరలేని భరతునికి దక్క నందఱకుఁ దెలిసియేయున్నది.

కైకే:— పట్టాభిషేక మెప్పుడంటివి?

మంథర:— ఇప్పుడే - ఇఁకఁ గొంత సేపటికి.

కైక:— నీ యొగతాళి చాలింపుము-ఇఁక నెన్ని దినములున్నది? నీ కెవరు చెప్పిరి?

మంథర:— ఎన్ని దినములా? ఇట్టి కార్యములకు వ్యవధానము కూడునా? భరతుఁడు వచ్చిననేమి విఘ్నములు పుట్టునో యని గదా యతని కెఱుఁగరాకుండ నేఁడే పట్టాభిషేక మొనర్పనీహృదయేశ్వరుఁడు నిశ్చయించె. నీవు రాజపుత్రికవయ్యును - నీయొద్దఁ గార్యదర్శన నైపుణ్యము లేమిఁ జేసి ఇట్టి తంత్రమును మహారాజుగారు పన్నఁగలిగినారు నీవు స్వభావముచేత మంచిదానవు కావున, అందఱు నట్టివారే యని తలంచుచున్నావు. నీ కన్నులయెదుర నీ సవతికొమరుఁడు చక్రవర్తియై రాజ్యపాలనము చేయుచుండ నీ వెట్లు చూడఁగలవు? కౌసల్య నిన్నింక నేల మన్నించు? రాజుగారి క్రూరాభిప్రాయము నెఱుఁగక నీకుఁ గడుఁ బ్రియుఁడని యెన్నుకొనుచున్నావు. నీయందాతని కాదరణమే

యున్న యెడల నీకార్యమున నీతోఁడ నేల యాలోచింపఁడు? కౌసల్యదాసి నాకీవార్త యిప్పుడే చెప్పినది. దాసీజనులు, పురజనులు నందఱు నెఱింగినవార్త నీకెఱిఁగించుటయందు జేసి కేమి హానిగలదు? ఒక్కమాట యోజింపరాదా? ఈ శుభకార్యమున కింత త్వరయేల? భరతశత్రుఘ్నులు రామునకుఁ బ్రియములైన తమ్ములుకదా! వారులేకయే యీకార్యమును జరుపవలసిన పనియేమి?

ఈ ప్రకారము దురాలోచనములకుఁ బుట్టినిల్లయిన మంథర యనేకవిధముల బోధింపఁగా గైకకుఁ గొంతవడికి దాని మాటలు యథార్థముగాఁ దోఁచి ప్రక్కనుండి లేచి "చెలీ! నీమాటలలోని సత్యము నాకిప్పటికి వెల్లడియైనది. వృద్ధరాజు నన్ను మోసగించి, యీ కార్యము జరుపవలెనని తలఁచినాఁడనుట స్పష్టము. కాని దైవఘటన మన కనుకూలముగా నున్నందున, నెట్లో యీవార్త నీచెవినిబడినది. ఇఁకఁ గైకేయియొక్క సామర్థ్యమును జూడుము కౌసల్యకు దాసుఁడై భూపాలుఁడు నాకుమారునికి రాజ్యములేకుండఁ జేయ నిశ్చయించెఁగాక! ఆకోర్కి యీడేఱునదికాదు. నేను రాముని నరణ్యము పాలుగావించి భరతుని-రాముఁడెక్కనున్న-సింహాసనమునఁ బ్రతిష్ఠించెదను, వృద్ధరాజు నన్ను సామాన్యవనితనుగాఁ దలంచె గాఁబోలు. తత్ఫలము నేఁడే యతఁ డనుభవింపఁ గలఁడు. నేనే యశ్వపతిమహారాజుగర్భమున నుదయిం

చిన దాననేని, ఈ సాయంసమయములోన కౌసల్యాపుత్త్రుని సకళత్రముగ నడవికి సాగించెదను." అనిచెప్పి కైకతనలోఁ దాను గొంత యాలోచనము సల్పుచుండెను. మంథర తన ప్రయత్నము కొనసాగుటకు సంతసిల్లుచుండెఁగాని, సూర్యుఁ డుదయాద్రి నెక్కుసమయ మాసన్న మగుచున్నందువలనను పట్టాభిషేక మిఁకఁ గొన్నిగడియలలోనే జరుగవలసి యున్నం దునను, దశరథుఁడు కైకసౌధమునకువచ్చు చిహ్నములేమియు లేనందునను 'తనదేవి యాప్రతిజ్ఞ నెల్లు నెఱవేర్పఁగలు గునా?" యని సంశయించుచుండెను. ఇంతలోఁ బ్రతీహారుఁ డొకఁడువచ్చి వికసితముఖముతో 'మహారాజుగారు విజయము చేసియున్నారు. దేవిగారితో విన్నవింపు' మని మంథరతోఁ జెప్పెను. ఈమాట లోపలనుండి వినుచున్న కైక, తన పగఁ దీర్చుకొనుటకును దనసంకల్ప మీడేర్చుకొనుటకును సమయ మొదవెనని సంతోషించి, తనమేననున్న యాభరణముల నెల్లఁదీసివైచి, యొక మలినవసనమును దాల్చి రూపము ధరించిన శోకరసము చెన్నునఁ గన్నుల బాష్పములు వెడల నిట్టూర్పులు పుచ్చుచు, లోపలి సౌధమ్ములో నొకమూల నేలమీఁద నొఱగి పరుండియుండెను.

# తృతీయాధ్యాయము

దశరథుఁ డంతఃపురములోనికి బ్రవేశించెను. ఎప్పుడు నెదు రొక్కని హృదయేశ్వరుని లోపలి సౌధమునకుఁ గొనిపోవు కైకేయి యెదురుగా రాలేదు. పరిచారికలును దుఃఖార్ణవ నిమగ్నలవలెఁ జూపట్టుచుండిరి. దశరథుఁడు, మంథర కైక కాంతరంగికురాలైన పరిచారికయని యెఱిఁగినవాఁడు గావున, మంథరనుగూర్చి ప్రశ్నించెను. 'ఏమికారణమో తెలియదు. దేవిగారు నిన్నటినుండియు నిద్రాహారములు మాని యున్నవారు' అని మంథర ప్రత్యుత్తర మిచ్చెను. ఇట్టి కోపసమయము లప్పుడప్పుడు కైకయెడఁ గలుగుచుండుట యెఱిఁగినవాఁడు గావున దశరథుఁడు దేవియొక్క కినుకఁగూర్చి విశేషము శంకింపక లోపలి సౌధములోని కెప్పటివలెఁబోయి కేక యాత్మజను లేపి "ప్రేయసీ! నీవేల యిట్లు దుఃఖార్తవై యున్నావు? నీ కెవ్వరెగ్గాచరించిరి? సంతోషసమయమున నెవ్వరివలన నీకీయెడరు వాటిల్లె? అట్టివాఁడు సురాసుర గంధర్వులలో నెవ్వఁడైనను సరే వాని శిక్షించెదను. లేక, నీ వెద్ది యేనియుఁగోర నే నొసఁగనైతినా? అధరమ్ము బీటలువాఱ నేల యేడ్చెదవు? కన్నీరు కాల్వలుకట్ట నేల దుఃఖించెదవు? స్వర్గమర్త్య పాతాళములయందు దుర్లభమైన యెట్టిపదార్థము గోరితివో నా కెఱిఁగింపుము. అట్టిదేని దెచ్చి నీకు సమర్పించెదను. నా ప్రాణములు నీ యధీనములు. నన్నాజ్ఞాపింపుము" అని పెక్కు తెఱంగుల వేఁడుకొనెను.

కుటిలస్వభావురాలగు నాకైకయుఁదన మేలిముసుంగుఁ దొలంగఁద్రోసి యానృపోత్తముని ముఖమునందు దృష్టినిడి 'నృపోత్తమా! నీవుధర్మవిదుఁడవు. ఆడినమాటఁదప్పవుగదా' యని మరల నతనిఁ బ్రశ్నించెను. ఇట్టిప్రశ్న ప్రతివచనములు మున్నెన్నిపర్యాయములో గలిగినవిగావున దశరథుఁడు, ఇంచుకేనియు యోజింపక "దేవీ! ఇదిగో! నీకోర్కెనీడేర్చుటకు సిద్ధముగా నున్నాఁడను. ఇందుకుఁ దప్పితినేని భూమ్యాకాశములు నన్ను శిక్షించుఁగాత" మనిచెప్పి 'నీవు వలయునన్న శ్రీరామచంద్రునిమీఁదనే ప్రమాణముగావించెద' నని కైకయందలి ప్రేమచేత నట్లేగావించెను. దశరథుఁడు సత్యపాశబద్ధుఁడనియు, సత్యమతిక్రమింపఁడనియు, నెఱిఁగినది కావునఁ గైకేయి తనకోర్కె యీడేఱుటకు నుల్లసిల్లి దశరథునివంకఁ జూచి "దేవా! మన పూర్వవృత్తమును గొంత సంస్మరింపఁ జేయ నాకు నవసర మొదవినది. తొల్లి శంబరాసుర సంగ్రామమందు, ఇంద్రుఁడు సహాయము కోరినప్పుడు మీరు స్వర్గమునకు నన్నుఁ బిలుచుకొనిపోయినది స్మరించుకొనుఁడు. అప్పుడు రాక్షసులతోడఁ జేసిన యుద్ధమున మీరు రథముమీఁద మూర్ఛిల్లిపడఁగా నేను రథమును దూరముగాఁ దోలికొనిపోయి మీ ప్రాణములు కాపాడినందుకు సంతసిల్లి మీరు రెండు వరములు కోరుకొమ్మంటిరి. అప్పుడు నేను ఆవరములు మీయొద్దనేయుండనిండనియు వలయునప్పుడుకోరుకొనెదననియుఁ జెప్పి యొప్పించితిని. ఆ రెండువరములును నేఁడు మిమ్ముఁ గోరఁ దరుణ మొదవినది" అని హెచ్చరించెను.

దశరథుఁడు:—చక్కఁగా జ్ఞప్తికిఁ దెచ్చితివి, ప్రాణేశ్వరీ! అప్పు డట్లు నా ప్రాణము కాపాడిన నీవు చేసిన మేలునకు ఋణము తీర్పఁగలనా? అఘోరసంగ్రామమునందు స్మరించుకొనిన, నాకు నిప్పటికి నద్భుతము గలుగుచున్నది. ఐనా, అసందర్భముగ నిప్పుడు జ్ఞప్తి చేయవలసిన యవసరమేమి? అట్టిసందర్భము లేకున్న మాత్రమున నేను నీకోర్కెలు సఫలముగాఁ జేయనా; పలికినట్లనని నేఁడు విశ్వసింపకున్నదానవు? ఇదిగో, సూర్యచంద్రులు సాక్షిగా నీ రెండువరములును, ఒసఁగినాఁడను.

దశరథుని మాటలకు మిక్కిలి యుప్పొంగి కైక తన రెండు వరములును, మూఁడుమాటలలోఁ జెప్పివేసెను. శ్రీరాముని పట్టాభిషేకమును మాన్పి యా వస్తువులతో భరతుని యౌవరాజ్యమున కభిషిక్తునిఁ జేయుట యొకటి. శ్రీరాముఁడు పదునాలుగేండ్లు దండకారణ్యమునందుఁ దాపసుఁడై చరించుట మఱియొకటి.

అక్కటా! అప్పుడు దశరథుని చిత్తవృత్తి యేమయ్యెనని చెప్పవలయును? ఆయనబుద్ధియేమి యాతనను విడనాడిపోయెను. 'నాకేమి దుస్స్వప్న మగుచున్నదా? కాక వాస్తవముగా నేను కైకగృహమునందున్నానా' యని కొంతతడవు యోచించెను. ప్రక్కల నెవ్వరును లేరు. కైక యొక్కతియ నూత్రి మెదుట నున్నది తానున్నది కైకయొక్క మేడయే. సూర్యోదయము కావచ్చుచుండెను. దశరథునకు యాథార్థము స్ఫురించెను. రాముఁడు రాజైనఁ దనకుమారునకుఁ గీడు వాటిల్లునని కైక యీవరములు కోరుకొనినది, "హాతోస్మి" యని దశరథుఁడు

మూర్ఛిల్లెను. తెప్పిఱిల్లెను, 'ఇది యథార్థముగా నుండునా? కాక కైక నా మనోదార్ఢ్యమును బరీక్షించుటకై యిట్లొన రించుచున్నదా?', యనుకొని కైక మోమువంకఁ జూచెను. అక్కడ చిఱునగవుగాని కరుణగాని కనఁబడలేదు. క్రౌర్యము తాండవమాడుచుండెను "ద్రోహీ" యనిదశరథుఁడు మరల మూర్ఛిల్లెను.

దశరథుఁడు:—కైకా! రాఘవుఁడు నీకేమి యెగ్గొనరించె? నిన్నుఁ దన తల్లికన్న మక్కువగాఁ జూచుకొనుచుండునని నీవే చెప్పితివే. నేఁడు నీకేల యిట్టి బుద్ధికలిగె? రఘుకులాలంకారుని రామచంద్రుని బాసి నే జీవింపఁగలనా?

కైక:—రాజా! సత్యసంధుఁడవు గమ్ము. ఇక్ష్వాకువంశమున జనించి చక్రవర్తివైన నీవే సత్యోల్లంఘనము సేసెదవేని లోకమెట్లు నిల్చు?

దశరథుఁడు:—నీవు చేయుపనియొక్క పరిణామమును నీవు చూడ నేరకున్నదానవు. రాముఁడడవులకుఁ బోయెనేని నా ప్రాణములు నిలువఁజాలవు. నా వెంటనే కౌసల్యయు సుమిత్రయును బ్రుంగుదురు. కల్లలాఁడీ! ఇక్ష్వాకుకులమంతయు నీవలన నిర్మూలముగానున్నయది. నీకు నేఁడేల యిట్టి దుర్బుద్ధిపుట్టె? ఎవ్వరు బోధించిరి? ఆ రామచంద్రునెడ నీకుఁగల ప్రేమాతిశయమంతయు నేఁడేమైపోయినది? అయ్యో! సుకుమారియైన జనకజాత్మజ యీదుఃఖము నెట్లు భరింపఁగలదు? వృద్ధదశయందు రాజ్యభారము రామచంద్రునిపైఁ బెట్టి కొడుకులఁ గోడండ్రఁ జూచుకొని సంతో

పింపలయునని యున్న నా తలంపులన్నియు నేలపాలుగా నీకీబుద్ధి యెవ్వరుగఱపిరి? నేను కౌసల్య మొగ మెట్లు చూడఁగలను? రాము నరణ్యమునకు నేల పంపితివని వసిష్ఠాదులడిగిరేని నేనేమి చెప్పుదును? అక్కటా! ఎన్ని తపములో చేసి, ఎందఱు వేల్పులకో మ్రొక్కి, ఎంతకష్టమోపడి కనఁగొన్న కుమారుఁడే, సుకుమారుఁడే! ఆ రామచంద్రు నరణ్యములపాలుగావించుమన్నావా? 'వినాశకాలే విపరీత బుద్ధి' యనుట నిశ్చయమైనది. నేనీవార్త రామున కెట్లు తెలుపుదును? పరిపూర్ణచంద్రబింబమువలె మనోహరమైన ముద్దుమొగముతో వచ్చి నాప్రక్కనిలిచి 'తండ్రీ! యేల నన్నుఁ బిలిపించితిరి?' అని రామచంద్రుఁడడిగెనేని నేనేమి చెప్పుదును? ఆహా! నాహృదయము బ్రద్దలగుచున్నది? నీవేమి చేయుమన్నఁ జేసెదను. కౌశల్యను విడువుమంటివా? ఇదిగో! సిద్ధముగా నున్నాను. సుమిత్రను విడువుమంటివా? విడుచుచున్నాను రాజ్యము - భోగము - అన్నియు విడుచుటకు సిద్ధముగానున్నాను. మా రాఘవుని మాత్రము—

కైక:—దేవా! ధర్మహీనములయిన వాక్కులతో నేమి ప్రయోజనము? పూర్వము స్వార్థత్యాగపరులైన రాజులు నీవలెనే ప్రవర్తించిరా? అలర్కుఁడను రాజొక బ్రాహ్మణుఁడు కోరినఁ దనకన్నులే తీసియియ్యలేదా? శిబిచక్రవర్తి స్వమాంసమునుగోసి పక్షిమాత్రమున కొసంగలేదా? నీవు కౌసల్యకు దాసుఁడవై యామెకోపమునకు భయపడి

ధర్మమునే యతిక్రమింపఁ దలఁచుచున్నవాఁడవు. ఇట్టివాఁడవు వరముల నేల యిచ్చితివి? నీవలనఁ బూర్వరాజచరిత్రమంతయుఁ గలుషీభూతమైనది. సర్వధర్మములలోను సత్యమెక్కువయని శాస్త్రములు ఘోషించుచుండఁగా, నీవేల యిట్లు భ్రాంతుఁడవగుచున్నావు?

దశరథునకు నేమియుఁ దోఁపలేదు. మాటలాడలేదు. ఆయనమనస్సులో నేమితలంపు లుప్పతిల్లుచున్నవో యెవరు చెప్పఁగలరు? 'సత్యమతిక్రమింతునా? రాముని వదలుదునా?' యని కొంతవడి చింతించెను. రామచంద్రుని మనోహరాకారమాయన మనోనేత్రమునకు విడువక కన్పట్టుచుండెను. 'రామచంద్రుని విడనాడనేర'నని దశరథుఁడు దృఢవాక్యతోఁ జెప్పి మరల మూర్ఛిల్లెను. కొంతవడికి మరలఁ దెప్పిఱిల్లి చూచుసంతకుఁ బార్శ్వమునఁ గైక శైత్యోపచారములు సేయుచుండెను. దశరథుఁడు కైకవంకఁ జూచెను. మొగమునఁ గ్రౌర్యమే కనఁబడుచుండెను. పూర్వము మనోహరమై సకలతాపముల మాపఁజాలిన కైకనెమ్మోముఁ జూడఁజాల. నన్నుఁ బ్రక్కగదికిఁ దీసికొనిపొండు. ఈసంభారములతో రాముఁడే నాకుత్తరక్రియలు జరుపుఁగావుత' మని దశరథుఁడు దుఃఖము నాఁపఁజాలక బోరున నేడ్చెను. కైకమనస్సు కరఁగలేదు. 'నీవుగాని భరతుఁడుగాని నాకుఁ దిలోదకము లియ్యరాదు. నాయొడలు స్పృశింపరాదు' అని కైకతోఁ గడపలుకు పల్కి దశరథుఁడు మరలఁ గన్నులు మూసికొనెను.

# చతుర్థాధ్యాయము

భగవంతుఁడగు సూర్యుఁ డుదయశిఖరి నధిరోహించి తన కిరణములచేత నంధకారమును బటాపంచలు సేయుచుండెను. శకుంతసంతానములు కలకలారావములు చేయుచుఁ జెట్లనుండి యాకసమున కెగురుచుండెను. పురవీథులలోఁ బ్రజాసంచారము వెలయసాగెను. దశరథునకుఁ గొంత స్మృతి గలిగెను. కైకేయి యెదుటనేయున్నది.

“రాజా! ఏలయీయాలస్యము! ‘దర్మస్య త్వరితాగతి’ యనుట యాకర్ణింపవా! శ్రీరాముని బిల్వఁబంపి వనమునకుఁ బంపు జతనమ్ము తత్క్షణముగావింపుము. భరతునకు రాజ్యాభిషేకము గావింపుము. నేను నా పట్టు విడుచుదానఁగాను.”

సూర్యోదయమైనది. ప్రతిగృహమును శృంగారకలితమైయున్నది. ఎల్లవీథులును రాజవీథులైనవి. ఇక రాజవీథి స్వర్గరాజధానివలెనే యున్నది. భటవర్గము లెల్లకడల నాయుధపాణులై బారులు దీరియుండిరి. ఎక్కడను గదళీస్తంభములే. ఎక్కడను సువాసనలే. మంగళవాద్యములు విరామము లేక మ్రోఁగుచున్నవి బ్రాహ్మణులును, పురంధ్రీజనములును, ఇతరులును గుంపులుగూడి లగ్నమునకు నిరీక్షించుచుండిరి.

ఇప్పుడు వసిష్ఠుఁడు పట్టాభిషేక సంభారములు గొని శిష్యులతోడ మహారాజదర్శనము సేయవచ్చెను. సర్వవస్తువులును సంసిద్ధములైయున్నవి, గంగాదినదీజలములతో నింపఁబడిన స్వర్ణకలశములు, ఛత్రచామరములు; రథగజతుర

గాదులు, లాజలు, దర్భలు నన్నియు సిద్ధముగానున్నవి. వసిష్ఠుఁడు తనరాక చక్రవర్తికిఁ దెలుపు సుమంత్రుని బంపెను. ఇతఁడు రాజునొద్ద రథచోదకుఁడు, వృద్ధుఁడును, దశరథునకు మిక్కిలి నమ్మకముగలవాఁడును గావున నంతఃపురములోనికిఁ బోఁగలఁడు. దశరథుఁడు కైకేయీగృహమునందుండుట తెలిసికొని యక్కడకుఁబోయి తేనినిదర్శించెను. ఆమెడుకూర్కియుండెను. "రాజుగారు పట్టాభిషేక మహోత్సవవిధానమును గూర్చి రేయెల్లఁజింతించియున్న కారణమున నిప్పటికిని నిద్రపోవుచున్నారు. నీవుపోయి రామచంద్రుని నిక్కడకుఁ దోడ్కొని రమ్ము. ఆవల సర్వము నాయిత్తపఱుపవచ్చును" అని కైకేయి చెప్పెను. ఈమాటలకు దశరథుఁ డల్లనమేల్కాని రామచంద్రునిఁ దోడ్కొనిరమ్మనియె. సుమంత్రుఁడు పోవునంతకు రామచంద్రుఁడు మేల్కాంచి కాల్యకరణీయములుదీర్చి తన యంతఃపురములోఁ గనకపర్యంకమునఁగూరుచుండియుండెను. సీతాదేవి ప్రక్కఁజామరము వీచుచుండెను. దంపతుల ముఖములసంతోష సంభ్రమములు పెనఁగొనుచుండెను. ప్రకృతిసుకుమారులై జగన్మోహనవిగ్రహులైన యా దంపతుల మోముల నాటుకొనియున్న నాఁటి యుల్లాసము చూచి తీరవలయుఁగాని వ్రాసితీరదు. సుమంత్రుఁడు తండ్రి యాజ్ఞ నివేదించెను. "ఇదిగో! వచ్చుచున్నాఁడను. దేవీ! నీ విక్కడనే యుండుము" అని సీతతోఁజెప్పి రాముఁడు కక్ష్యాంతరములు వెడలివచ్చి యుచితవేషమునుధరించి కైకేయిసౌధమునన్న తండ్రికడకుఁ బోయెను. దశరథుఁడు పరుండియుండెను. రాత్రి

నుండియు నిద్రలేవలేదా? కాదు. నూత్నతిలకముతోఁగూడిన యతని ముఖమును, దివ్యవస్త్రములు, దివ్యాభరణము లన్నియును నాయన ప్రాతఃకాలకరణీయములు దీర్చియున్న సంగతిఁ బ్రకటీకరించుచుండెను. ప్రతీహారుఁడు రాముఁడు వచ్చుచున్న సంగతి నివేదించెను. రాముఁడు ప్రవేశించెను. దశరథునిఁ డాక్కపరి కన్నెత్తి చూచెను. తలవంచుకొనెను. దశరథుని కన్నులనుండి బాష్పములు కాల్వలుకట్టఁగాఱుచుండెను నన్నేల హెచ్చరించుకొనఁడనుకొనుచు రాముఁడు నమస్కరించెను. దశరథుఁడు గ్రుచ్చికౌఁగిలించుకొనలేదు. శిరము మూర్కొనలేదు. ఆశీర్వచనముగావింపలేదు. మొగమువంకఁజూడలేదు. రామునకు నేమియుఁ దోఁపలేదు. భయాకంపితుఁడయ్యెను. 'నేనేమి ధర్మ మతిక్రమించితినా? నా యెడఁ దండ్రికీ కుపితభావమేల? ఈదైన్యమేల?' యని పెక్కువిధముల యోజించెను. కైకేయికి నమస్కరించెను. 'చిరంజీవ సుఖీభవ' యని యామె యాశీర్వదించెను. దశరథుడు కన్నెత్తి కైకవంకఁజూచి, మరలఁ దలవంచుకొనెను. ఈలోఁగైక రామునిగూర్చి 'కుమారకా! నీతండ్రి మోహపాశబద్ధుఁడై నిన్ను ధర్మమందు నియోగింపఁజాలకున్నవాఁడు; నీవుపితృవాక్యపరిపాలనమునందు బద్ధదీక్షుఁడవయ్యెదవేని, నీ తండ్రి నాకుఁగావించిన వాగ్దానమ్ము నిప్పుడ చెప్పెదను' అనిచెప్పి తాను మున్నుకోరిన వరములును నవి దశరథుడు నేఁడిచ్చిన సంగతియు రామునకుఁ దెలియఁబఱిచెను. రాముఁడు క్షణమాత్రము యోజించి తండ్రి కభిముఖుఁడై "నృపోత్తమా! ఈపాటిపనికి నింత చింతిల్లనేల? మీకోర్కె నెఱ

వేర్పుటకు నడవులకుఁబోవుటకుగాదు. అగ్నినఁ బడుమన్న నుఱికెదను. విషముం ద్రావుమన్నఁ ద్రావెదను. తండ్రియాజ్ఞ యొనరించుటకన్నఁ గొడుకునకు వేఱు శ్రేయస్సు కలదా? అందును, ఇది మీయాజ్ఞ యగుటమాత్రమేగాక మాతల్లియైన కైకకు నభీష్టమైన విషయముగానున్నది. ఇట్టి ధర్మాచరణ మునకును వేఱొక్కటి దొరకునా? ఇక్ష్వాకువంశమునఁ బుట్టి ధర్మవిశ్రేష్ఠుఁడవని పేరువడసిన నీకుఁ గుమారుఁడనై రాజవంశజుఁడనైన నేనే రాజ్యలోభమున ధర్మ మతిక్రమింతునేని, లోకమున ధర్మముపాటించువారెవ్వరు? మీరు మా తల్లికిచ్చిన వరముల నన్యథాకరింపక నాకుఁ గానలకుఁబోవుట కనుజ్ఞనీయవలయు. భరతుని రాజ్యాభిషేకమునకు నా తమ్ములును దక్కినవారలు నందఱు నిక్కడనే యుందురు. కావున మీరీ కార్యమును వారలతో నెఱవేర్చుకొనవచ్చును." అని విన్నవించెను. దశరథుఁడు పలుకలేదు. రాముఁడు చెప్పిన మాట లాయన గ్రహించెనో లేదో చెప్పుటకు వీలు లేదుగాని యాయనదృష్టిమాత్రము రామచంద్రుని ముఖమండలము నందే నెలకొని మరలి రాకుండెను.

అంతఃపురమునఁ బాటిల్లిన యీవృత్తాంత మెట్లో కాని క్షణకాలములోఁ బురములోనెల్లఁ బ్రకటమయ్యెను. జనులు గుంపులుకూడి యీయన్యాయ్య మొక్కరితో నొక్కరు చెప్పుకొనసాగిరి. 'ఇది నిక్కముగానుండునా? కైకయింత క్రూరపుఁగార్యముచేసినదా?' యని కొంత తడవెవ్వరును నమ్మరైరి. కాని, కైకయంతఃపురములోని యలజడినిబట్టియు,

దాసీజనుల రాకపోకలనుబట్టియుఁ బట్టాభిషేకమున కేదో యొక్క యనర్థము పొసగినదని యెల్లరును నిశ్చయించు కొనిరి. మంగళవాద్యములు మ్రోఁగుచునేయున్నవి. ధ్వజ పతాకాదులతోఁడఁగూడి పట్టణమనిర్వాచ్యసౌభాగ్య సంప న్నమైయున్నది. 9 గంటలు, 10 గంటలు-వాద్యములమ్రోఁత నిలిచినది. పట్టపుటేనుఁగు కళ్యాణమంటపము నొద్దనుండి మరలిపోవుచున్నది. ఇప్పుడు పౌరుల మనస్సులోనున్న సంశయ లేశముగూడఁ దొలఁగిపోయి పట్టాభిషేక ప్రయత్నము భగ్న మైనసంగతి స్పష్టమైనది. కైకేయీ దుశ్చరిత్రమగ్ని హోత్రమువలె నెల్లచోటుల నల్లుకొనియె. పట్టణమెల్ల నల్ల కల్లోలమయ్యెను. ఎక్కడఁజూచినను జనులు దుఃఖపరవశులై కైకయాత్మజను దూషించుచుండిరి. కొందఱు 'భరతునభి షేకమునకు నివియేల'యని ధ్వజపతాకాదులను బీఁకివైచు చుండిరి. మఱికొందఱేమియుదోఁపక పిచ్చివాండ్రవలెఁ దిరుగు చుండిరి. ఈసమయమునఁ గైక యంతఃపురము చుట్టును గ్రూరోద్దేశముతోఁ జుట్టుకొనియున్న జనుల సంఖ్యకు లెక్క యేలేదు. మాతృదేవుఁడైన రామచంద్రుని కప్రియమని కావింపరైరిగాని, లేకున్న నాఁటి యుద్రేకమున గైకేయీ సౌధ ముత్పాటితము, దగ్ధమును గాకుండెనా?

"రామచంద్రునిఁ జూడవలయు, రామచంద్రునిఁజూడ వలయు"నను శబ్దములమ్రోఁత మిన్ను ముట్టెను. రాముఁడు కౌసల్యాదేవియొక్క సౌధమునఁ దల్లి కీవార్త విన్నవించు చుండెను. అక్కటా! చిరకాలము కొడుకులులేక ఎన్నినోములో

నోఁచి ఎన్నివ్రతములో యాచరించి, ఎన్నికష్టములో పడి కనుఁగొన్న కుమారుఁడే! కౌసల్య వానివనవాసమున కెట్లు సమ్మతించును? సమ్మతి పకున్న విధ యేమి? నాఁటిదినము కౌసల్యకుఁగలిగిన దుఃఖము లోకములో నేతల్లికి నెన్నఁడును గల్గియుండదు. తన పుత్త్రుఁడు పదునాలుగేఁడులు ఘోరారణ్యముల పాలగుటకు నేమి యధర్మమొనరించె? తండ్రి కప్రియము చేసెనా? తుదకుఁగైకకైనఁజేసెనా? మొదలంట నఱకఁబడినఁ కదళివలెఁ గౌసల్య నేలఁగూలి మూర్ఛిల్లెను.

ఈ తల్లి గొడుకులను నటుపిదప భార్యాభర్తలకును జరిగిన సంభాషణములు వ్రాయుటకు మాలేఖిని విషాదముచేఁ బరవశమగుచున్నది. ఎంతచెప్పినను బెడచెవినిఁబెట్టి భార్యకు భర్తననుసరించుటయే ధర్మమని సీతాదేవి వనవాసమునకుఁ దన్నుఁదోడుకొనిపొమ్మని రాముని నిర్బంధించెను. అన్న ననుసరించుటకన్నఁ బరమధర్మములేదని లక్ష్మణుఁడు రామునకన్న నరణ్యమునకు ముందడుగు పెట్టుచుండెను. రాముఁడనేకవిధములఁ జెప్పిజూచి విఫలుఁడై యెట్టకేలకు సీతాలక్ష్మణులు తన్ననుగమించుట కనుమతించెను. వీరు మువ్వురును కైకేయీసౌధమునకుఁబోయి యాదినమే తల్లులవలనను, వసిష్ఠాది పురోహితులవలనను, దశరథునివలనను, విప్రులవలనను సెలవు గైకొని నారచీరలుధరించి, దండకాటవికిఁ బ్రయాణమైరి. అతి సుకుమారులై రాజ్యసింహాసనమునకు యోగ్యులైన చిన్నికుమారులు రామలక్ష్మణులును, ఆగర్భశ్రీనిధియై సర్వాంగసుందరియైన జానకీదేవియు సర్వాభరణ

ములు తీసివైచి నారచీరలు ధరించి, అరణ్యాగమనోన్ముఖులై, నిలిచిన సమయమునఁ బౌరుల మానసములే వ్రీలి నీరై పోయెను. ఇఁక వారివలన నెల్లసౌఖ్యముల ననుభవింపవలయు నని వారి తోడిదే లోకమని తలఁచియున్న వృద్ధరాజును, కౌసల్యాసుమిత్రలు నేమైరో యెవ్వరు చెప్పఁగలరు? కులపాంసనీ, కైకా! ఏమి నీకార్యము! సహజసౌన్యుఁడైన మా రాఘవుఁడు నిన్ను దూషింపకున్న మానెఁగాని, ఈ దుష్కార్యమువలన నీవేలాభ మనుభవించితివి? రావణవధవలనఁ దాపసులకెల్ల మేలుగావించితినందువా? అందు నీ ప్రభావమేమున్నది? అది రామలక్ష్మణుల బాహుబలము వలనఁ జేకూరిన జయముగాక, యాయడవులలో నిడుమల పాలై యా వీరు లడలినదియెల్ల నీ కుటిలవర్తనమువలనఁ గాదే? అతిలోక ప్రభావసంపన్నులై విఘ్నముల నెల్లఁ బాఱఁ దోలి, వారు మరలఁ బురమునకు వచ్చిరిగాక; రాకున్న నీ కెట్టి యపకీర్తి ఘటిల్లియుండు! లోభమా! నీశక్తి యప్రతిద్వంద్వముగదా! కావుననే పెద్దలు 'లోభస్సర్వగుణాన్ హంతి' యని వ్యవహరించి నిన్నుఁ జూచి దూరముగాఁ దొలంగిపోవుట!

# పంచమాధ్యాయము

భరతుండు రాజగృహపురమ్మునఁ దనమేనమామ యింట సుఖమ్ముగా నుండెను. ఈ పట్టణమునే ప్రస్తుతము "రాజఘర్" అని యందురు ఇది యయోధ్యకు ౫౦౦ మైళ్ళ దూరమున నున్నది. ఇక్కడఁ దన మేనమామయింట భరతుఁడును, శత్రుఘ్నుఁడును నయోధ్యలో జరుగుచున్న యద్భుతోదంతముల నేమియు నెఱుఁగక సుఖముగాఁ గాలక్షేపము సేయుచుండిరి దశరథుఁడు రాముని యౌవరాజ్యాభిషేకము సేయ నిశ్చయించినదిగాని, కైకవలన విఘ్నమాచరింపబడినదిగాని, రామలక్ష్మణులు సీతతోఁగూడి యరణ్యామునకుఁ బోయినదిగాని, వృద్ధరాజు రామవియోగాగ్ని తప్తుఁడై లోకాంతర గతుఁడైనదిగాని పాపము! ఏమియు నెఱుఁగరు. వారెప్పటివలె నుద్యానాది వనవిహారముల యందును, పురదర్శన మందును గాలమ్ము గడుపుచుండిరి. భరతునకు మాత్రము మనస్సునఁ గొంత వ్యాకులత తోఁచుచుండెను, సకలసంతోషసమృద్ధిగల్గిన ప్రభుమందిర మందుండియుఁ గొన్ని దుశ్శకునములును గొన్ని దుస్స్వప్నములును గాంచి వానికిఁగారణ మూరయనేరక భరతుఁడువిహ్వలుఁడై తనకో, తన యన్నకో, తన తల్లులకో, తన తండ్రికో, మెవరికో కీడు మూఁడియుండునా యని సంశయించుచుండెను. ఇట్లుండ నొక్కనాఁ డయోధ్యనుండి కొందఱు చారులు చనుదెంచియున్నారని ప్రతీహారుఁడొక్కఁడువచ్చి భరతునకు

దెలిపెను. "ఏమో యవసరమైన కార్యము గలిగి వసిష్ఠా దులును, మంత్రులును మిమ్ముఁ దోడ్కొనిరమ్మనిరి' అని చెప్పి చారులు విరమించిరి. భరతుఁ డెన్నివిధములో యడిగి చూచెను గాని వారి ముఖదర్శనమువలనఁగాని, వారి ప్రత్యుత్తరముల వలనఁగాని యతఁ డున్నచొప్పు గ్రహింపఁ జాలకుండెను. దశరథుని మృతివార్త గాని, పట్టాభిషేక భంగవార్త గాని యేమియుఁ దెలుపరాదని మంత్రు లాజ్ఞాపించినందున, చారులు మితాక్షరముగా నుత్తరముచెప్పి భరతునకు నే వికల్పమును దోఁపనీయరైరి. భరతశత్రుఘ్నులు తమ మేనమామవలన సెలవుగైకొని పయనమై యేడు రాత్రులలో నయోధ్యాపురికి వచ్చి చేరిరి. నిత్యకల్యాణము పచ్చతోరణమై యెల్లప్పుడు కలకలలాడుచుండు పట్టణ మరణ్యప్రాయమైయుండెను. భూసురుల వేద ఘోషములుగాని, క్షత్రియుల లీలావిహారములుగాని, వణిక్కుల క్రయ విక్రయ యమ్ములుగాని యేమియునులేక పట్టణ మంతశ్శోకమును వెల్లారించుచుండెను. రాజమార్గము లమంగళము లనలంకృతములుగా నుండెను. ఇండ్లు పాడిండ్లవలెనే యలంకారములు లేక, ముగ్గులులేక, తోరణములు లేక శృంగాటకములు నరనారీ విహారశూన్యములై యుండుటనుచూచి, భరతుఁడు రాజ్యమున కేదోయొక్క గొప్పవిపత్తు వాటిల్లియుండవలయునని నిశ్చయించుకొనెను. అతఁడు తనరథము డిగ్గి తొల్దొల్త దశరథుఁడుండు ప్రాసాదమునకుఁ బోయెను. అక్కడఁ దన తండ్రి లేమి నాయన తనతల్లి మేడలో నుండనోపునని క్షిప్రగతి భరతుఁడు కైకేయి సౌధమునకుఁ బోయెను.

ఎప్పుడు నవ్వుమోములతో వినమ్రలై యెదుర్కొను పరిచారికలు విన్నఁదనముతోఁపు మొగములతో మూలకొక రుగా నుండిరి. పంజరములోని చిలుకలును గోరువంకలును గొన్ని దినములుగా మేఁతలేనివానివలె దిగుల్పడి యుండెను. మిద్దె మెట్లెక్కిపోవుటలో గవాక్షమునుండి కన్పట్టు కైకేయి శయనగృహము శూన్యపర్యంకమై ప్రభచెడి యుండెను. భరతునకు యథార్థము స్ఫురించెను. 'నేను బోవునప్పటికిఁ జక్కని యారోగ్యమున నుండెనే తండ్రికి నింతలో నేమి వ్యాధి ఘటిల్లె?'నని తలంచుకొనుచు భరతుఁడు నగరిలోనికి వచ్చెను. కైక కనకాసనమ్ముపైఁ గూరుచుండి యుండెను. ప్రక్కనే మంథర యుండెను. తన తల్లి మొగము చూడఁ గానే, సత్యము నిశ్శంకముగా భరతుని మనమ్మునకు, దోఁచిఁ పోయెను. 'తండ్రీ!' యని భరతుఁడు మూర్ఛిల్లెను. మరల నప్పుడే శ్మృతిగల్గి 'మాతండ్రి యిట్లాకస్మికముగ మరణింప నేమైయుండెనో', యని కైకేయినిఁ బ్రశ్నించెను. కైక యేమి చెప్పఁగలదు? తన కొడుకునకు రాజ్యప్రాప్తి గోరెఁగాని యుత్తరుణి పెనిమిటిమరణమ్ము గోరెనా? దుఃఖగద్గదమైన స్వరముతో 'నాయనా! తండ్రిలేని వాఁడవైతివి. మీ నాయన స్వర్గస్థుఁడయ్యె'నని చెప్పి పట్టరాని మోహమునఁ గొంతతడవు పలవించి మరల నింతలోఁదన పుత్త్రునకుఁ గలుగ నున్న యభ్యుదయముఁ దలంచుకొని శోకమును గడకొత్తి భరతునితో "నాయనా! నీవిట్లు దుఃఖపడి యేమిప్రయోజనము? విధికృతము లెట్లో యట్లు జరుగవలయుఁగదా!

మీతండ్రి యజ్ఞశీలుఁడు ధర్మైకతత్పరుఁడు. అనఘుఁడు. ఆదిరాజుల వర్తనమువంటి వర్తనము గలవాఁడు. ఆయనను గూర్చి చింతింపనేల? పెక్కేండ్లు రాజ్యముచేసి సుఖముల నెల్ల ననుభవించి కోర్కెలెల్లఁ దీర్చుకొని మీరెల్ల సుఖులై యుండఁగనే తుచ్ఛమై నశ్వరమైన యీ మనుష్యదేహమును వర్జించి దివ్యలోకమునకుఁ బోయినవాఁడు. అపరిహార్యమగు నీయర్థమందు విషాదమేల? 'జాతస్య మరణం ధ్రువ' మ్మను మాట పెద్దలవలన వినుచుండలేదా? సకలశాస్త్రపారంగతుఁడవై సాధుసేవనము సల్పిన నీవే యిట్లు మోహసముద్రమున మునింగెద వేని నిన్నుఁ దేర్చువారెవరు? కావున నీదైన్యమును వదలి కానున్న కార్యముల నెఱవేర్చికొనుము. ఇదిగో! వసిష్ఠాది పురోహితులును, సకలసామంతరాజులును, ఎల్లరును నీ రాకకై వేచియున్నారు. దైవవశమున నీ కప్రయత్నముగా లభ్యమైన సింహాసనము నెక్కి నిష్కంటకమైన యీ రాజ్యమును చిరంజీవివై పాలింపుము" అని చెప్పెను.

భరతున కీమాటల కర్థము తోఁపలేదు. రామచంద్రుఁ డేమయ్యెను? రాజ్యము తనకు రానేల? రామచంద్రునెడఁ బుత్త్రివాత్సల్యముగల తనతల్లి యేల యిట్లు చెప్పుచున్నది? భరతుని చిత్తము గాలిలోని దీపమువలె సంచలించెను. తనువు వడఁకఁజొచ్చెను. నోటఁదడి యాఱుచుండఁ దల్లీ! రామచంద్రుఁ డెక్కడకు బోయినాఁడు? మాతండ్రి దశరథుఁ డేమైయుండి చనిపోయెను? నీమాటలు నాభావమును గలఁచుచున్నవి. నా కున్నరీతిఁ దెల్పు'మని వేఁడుకొనెను. భరతుఁ డాడినమాటల

వలననే, తన కుతంత్ర మాతని కిష్టము కాదని తెలిసికొనియు, నాతనిహృదయము మరల్పఁగలనను నమ్మకముతోఁ గైక భరతునివంకఁజూచి "నీతండ్రి యేమియుఁ గాలేదు. నేను పూర్వము దేవాసురసంగ్రామమందు, ఆయనకుఁజేసిన మేలుకుఁగా, ఆయన యిచ్చిన రెండువరములలో రాముని బదునాల్గేఁడు లరణ్యమునకుఁ బంపుమనియు, ఆ యుపకరణములతో భరతునకుఁ బట్టాభిషేకము గావింపుమనియు నడిగితిని. దానికియ్యకొని రాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై యరణ్యమునకుఁ బోయెను. ధర్మనిరతుడై మీతండ్రివరము లిచ్చియు, నన్ను, అపకీర్తిభాజనముగాఁ జేయుటకొఱకు రామునిఁ దలంచుకొనుచుఁ బుత్త్రశోకమున మృతుఁడయ్యెను. ఇది నావలననైన కార్యము. ఇది నీబుద్ధి కెట్లుతోఁచినను సరే. నీకుఁ పట్టాభిషేకము నెలయించు తలంపునఁజేసి లోకాపవాదమున కొడిగట్టి రామునిపాలైపోవలసిన యీ రాజ్యమును నీకుఁ దక్కించితిని. ఇఁక నీవు, ఇతరచింతలను మాని యీరాజ్యమును ఈభోగములను, అనుభవింపుము. నామాట వ్యర్థము కావింపకుము" అని చెప్పి విరమించెను. ఈమాటలు విన్నతోడనే భరతుఁడు నిశ్చేష్టితుఁడయ్యె. చిత్తరువులోని బొమ్మవలెనతఁడు గొంతతడ వూరకుండెను. ఏమియో చెప్పఁదలంచెఁగాని మాటలు రావయ్యె. నిట్టూర్పులు, అతని మొగమునుండి యాఁవరాక వెడలుచుండెను.

శాంతరస మొలుకుచుండు నతని వదనారవిందమున, ఇప్పు
డొక్కవికారము కన్పట్టెను. కన్నుల నిప్పుకలు వెడలు
చుండెను. క్రోధారుణాక్షుఁడైన భరతునిచూపులు కైక మొగము
నుండి మరలి యొక్కపరి అంగీలో నడఁగియున్న ఖడ్గము
వంకకుఁ బ్రసరిల్లెను. పరిచారికలు భయభ్రాంతలైరి. భరతుఁ
డేమి యుద్దేశించియున్నాఁడు? ఇది తల్లియిల్లుగాని రణరంగము
కాదే. ఖడ్గముతోఁ బనియేమి? శత్రు లెవ్వరున్నారు? ఈ
ఖడ్గమునకు వినియోగ మెక్కడ? తన యనుఁగుఁదోఁబుట్టువైన
శ్రీరామునకుఁ గైక కావించిన యపకృతికిఁ బ్రతికృతిగాఁ
దల్లినే వ్రేయనుంకించెనా? స్త్రీవధమునకును, అందునుమాతృ
వధమునకును మనభరతుఁ డొగ్గునని చెప్ప నోరాడకున్నది.
ఎంతతప్పుచేసినను దల్లి యదండ్యురాలుగదా! అట్లైన భర
తుఁడు ఖడ్గమువంకఁజూడనేల? ఆత్మవధమునే యుద్దేశించెనాఁ
తనకుఁ దనతల్లిదుశ్చేష్టితమువలనఁ గలుగఁబోవు లోకనింద ?
దలంచుకొని కుటిలమతియైన తనతల్లికోర్కెల్ల నేలఁగలుప
నెంచి యాత్మవధమునే యుద్దేశించెనా ? ఈ రెండును రాము
నకుఁ గారానిపనులే ఇవి మనభరతుఁ డేలయాచరించు? భర
తుఁడు క్షణము యోజించి "రాక్షసీ! నీసంకల్ప మీడేఱునది
కాదు. రామునరణ్యముపాలుగావించిననీవు నాకుఁగట్టఁదలఁచిన
రాజ్యమును రాముఁడే పొందుఁగావుత. రాజర్షియైన మాతం
డ్రిని, అసత్యభయపాశముచేత నురిదీసిసకలసామ్రాజ్యపట్టాభి

పితృఁడు కావలసిన రాఘవుని ఘోరారణ్యముల పాలుగావిం
చిన నీపాపమునకు మేరగలదా? ఆరాముఁడెన్నఁడైన నీ కప్రి
యము గావించెనా? తుదకు మాతల్లి కౌసల్యయైన? ఆహా?
కౌసల్య! కౌసల్యపేరు దలఁచుకొన్నమాత్రి నామనస్సు
నీరై పోవుచున్నది. నే నామె మొగము నెట్లుచూడగలను?
అయ్యో! నీకీబుద్ధి యెవ్వరుగఱపిరి? నేను రాజగృహమునకుఁ
బోవునప్పుడు రాముఁడు నీమేడకువచ్చి ఇక్కడనీపాదములకుఁ
బ్రణమిల్లఁగా నీవాతని గ్రుచ్చి కౌఁగిలించుకొని యెంత
యానందించితివి? ఆప్రేమయెల్ల నేమి యయ్యె? ఆనాఁడు
రాముని వెంటవచ్చిన సీతాదేవితో నెంతయో తడవు మంతన
ముండి యాదేవికి నీ వేమేమియో యాభరణములనిచ్చితివే,
ఆప్రేమ యేయేటఁగలసె? దురాత్మికా! నీకిలోన, ఈబుద్ధి
యెట్లుపుట్టెనె? నిన్ననవలసినది లేదు. నూఱుతలల విషసర్పము
వని యెఱుఁగక పూలదండయని తలఁచి నినుఁ దలకెక్కించు
కొనిన మాతండ్రిని, అనుకొనవలయును. అక్కటా! ఈదుఃఖ
మును నేను భరింపఁజాల, నేను రాజగృహమునుండి వచ్చిన
వృత్తాంతము విని యెంత యానందించునో, యెన్ని వార్తలు
నన్నడుగునో, ఎంత ఆదరించునో! అట్టి మాతండ్రిని నిమిష
మాత్రమున మృత్యువు పాలుగావించితివే. మాతాత దశరథు
నకుఁ దెల్పుమని చెప్పిన వార్తలనెల్ల నే నెవ్వరికిఁ జెప్పుదును?
ఉభయకులపాంసనీ? నీవలన రఘుకులము యొక్క యౌన్నత్య

మెల్ల నేలపాలై పోయినది. నాకు నీరాజ్యమున నెవ్వఁడు దిక్కు? ఈ యయోధ్యాపట్టణ మరణ్యముపోలెఁ జూపట్టుచున్నది. నేను నీమొగము చూడఁజాల" నని భరతుఁడు శోకము నాఁపజాలక పెద్దపెట్టున నేడ్చెను. "నామనస్సు శ్రీరాముని పాదారవిందములయందు లగ్నమైయున్నది నీ వేమోయను కొంటివిగాని, సంకల్పమీడేఱునదిగాదు. ఈ భరతుఁడే దశరథునికుమారుఁడయ్యేనేని, జ్యేష్ఠునకు రావలసిన రాజ్యమును దానపహరించువాఁడు కాఁడు. ఇంతమాత్రమ్ము కాదు. నేను పాదచారినై కాననములకుఁ బోయి యారాముని బిలుచుకొని వచ్చి నీయెదుట-నీకన్నుల యెదుట—ఈయయోధ్యాసింహాసనమునఁ బ్రతిష్ఠించెదను. మఱియు, నేనాతనికి దాసుఁడనై యిహలోకభోగములనెల్ల వర్జించి యీపదునాల్గు సంవత్సరములు తాపసుఁడనై యాతనిపాదములు గొల్చి బ్రతికెదను. రాముఁడు లేని యీ యయోధ్యాపట్టణమున భరతుఁడు క్షణమాత్రము నిలుచువాఁడుకాఁడు" అని చెప్పి భరతుఁడు చివాలునఁ గైకేయీసౌధము డిగిపోయెను.

# షష్ఠాధ్యాయము

భరతుఁడు కౌసల్యయింటికిఁ బోయెను. కౌసల్య సహజము గానే పుత్త్రులయందువాత్సల్యముగలది. ఆయింతికి భరతుఁడన్నఁ బ్రాణము. సత్ప్రవర్తనము శాంతము కలవాఁడనియుఁ దన కుమారుఁడగు రామునకుఁ గడుఁ బ్రియుఁడనియు భరతునియందుఁ గౌసల్యకు మిక్కిలి ప్రేమ. అయిన, నామె యిప్పుడు భర్తృమరణకర్శితయై పుత్త్రవియోగవిహ్వలయై యున్నది. భరతుని జూడఁగానే, యామె కెట్టిసద్భావము నుదయింపలేదు పైపెని గొన్నాళ్ళుగాఁ బరిచారికలలోఁ గొందఱతని కపటవర్తనమునుగూర్చి చెప్పుచున్నమాటలే యామె మదికిఁదోఁచెను. ఆర్తమనస్కులకు యుక్తాయుక్తములు దోఁపవు గదా! భరతుఁడు కనఁబడఁగానే, 'నాయనా! నీకోర్కులు ఫలించినవి కదా? నిష్కంటకమైన యీరాజ్యమును నీవును నీ తల్లియు యథేష్టముగా ననుభవింపుఁడు మాకు నాజ్ఞయైన నేనును సుమిత్రయు నెక్కడకైనఁ బోయెదము. ఎక్కడకో యననేల? మీతల్లికోర్కి మేరకు మేమునుమాకొడుకుగోడంద్ర తోడ వనవాసము గావించెదము. నీవు రాజవు గావున, రాష్ట్రము వదలిపోవుటకుఁగూడ మాకు నీయనుజ్ఞ కావలసి యున్నది" యని కౌసల్య వచించి యంతర్నిరుద్ధాశ్రువై యూరకుండెను. భరతుఁ డామెపాదములకుఁ బ్రణమిల్లినవాఁడట్లె మూర్ఛిల్లెను. కొంతతడవునకుఁ దెప్పిఱిల్లి "తల్లీ! ప్రియుడైన నాజనకుని మరణవార్తయు, ప్రియతరులైన నాయ

న్నలయొక్కయు, సాధ్వీమణి జనకనందనయొక్కయు వనవాస వార్తయు విని యు గుండియలు వ్రీలిపోని యీకష్టాత్ముని నీవేమన్నను యుక్తముగానే యున్నది. అయినను, ఘోరపరిణామమైన యీకార్యమందు నాకెట్టి ప్రవేశమును లేదు. నేను రాజగృహమ్మునందుండుటనుబట్టి యిక్కడ మాతల్లి కైకవలన నాయన్నలకైన యపకృతి నాకు లేశమాత్రమును దెలిసినది కాదు. నేనిక్కడనేయున్న యెడలఁగార్యము లెట్లుపరిణమించి యుండునో, యిప్పుడు నేఁ జెప్పికొని యుపయోగమును లేదు. ఇదిగాక, దైవము ప్రతికూలమైన కాలమున మంచిమాటలు గూడ వంచనోక్తులట్ల గాన్పించు. కాకున్న, శైశవము మొదలు కైకకన్న నెక్కుడు ప్రేమతో నన్ను నాదరించి నా సహజశీలము నందఱికన్న నెక్కువగా నెఱిఁగిన నీకే నేను సంశయితవ్యుఁడ నగుదునా? తల్లీ! యీభరతుఁడు రాముని వనవాసము గోరెనని నిక్కముగానే తలంచితివా? కర్కశారణ్యములలో రాముడు జటాజినములు ధరించి స్థండిలశాయియై పర్ణకుటీరములలోఁ బడరానిపాట్లు పడుచుండఁగా, ఈభరతుఁ డిక్కడ రాజభోగములు నిశ్చింతముగా ననుభవింపఁగలడనియే తలంచితివా! నీవలన నెట్టిమాటలు వింటిని! ఆహా! యీభరతుఁ డెట్టివాఁడైన నగుఁగాక భ్రాతృవనవాసమునుగోరినవాఁడు కాఁడు. పితృమరణము నిచ్చగించినవాఁడు కాఁడు. కౌసల్యాదేవి కడుపులోఁ జిచ్చుదరికొలుప నెంచినవాఁడుకాఁడు, జనకనందన నరణ్యము పాల్సేయఁ దలఁచినవాఁడు కాఁడు అక్కటా! ధర్మాధర్మము లరయు వారే లేరైరిగా! నాదుఃఖము నేనెవ్వరితోఁ జెప్పికొందు? కైక

మొగ మెట్లుచూతు? కౌసల్యకుఁ బ్రత్యయ మెట్లుఘటింతు?" అని పైపయి నావరించుకొనుచున్న విషాదముచేతఁ బరవశుఁడై లయకాలమందు భూమిమీఁదఁబడు నిండుగ్రిని కేతువు వలె భరతుఁడు కౌసల్యపాదములయొద్ద మరల మూర్ఛిల్లె. కౌసల్య మనస్సు నీరై పోయెను. ఆఁపరానిదుఃఖమున వికట మనస్కురాలగుటవలన, ఆమె భరతుని నేమియో దూఱి మాటాడెఁగాని, యామెకు సిక్కముగా భరతుని సత్ప్రవర్తనము దెలియకున్నదా? భరతుఁడు మూర్ఛనుండి లేచి ప్రక్కనే శైత్యోపచారములు చేయుచున్న కౌసల్య మొగమువంక దృష్టినిడి 'శ్రీరాముని వనవాసమునకు నేను సమ్మతించిన వాఁడనేని, ఊర్ధ్వలోకమునకుఁ దప్పినవాఁడ నగుదు. గురుద్రోహ మొనరించువాని కెట్టిదురితమో, గృహదాహకునకును విషము పెట్టువానికి నెట్టివృజినమో, పరధనపరకాంతాపహర్త కెట్టిపాపమో, బ్రహ్మవిధులగు, పెద్దలతో సల్లసములాడు తులువల కెట్టిపాతకమో, శ్రీరాముని వనవాసమునకు సమ్మతించిన వాని కదియగును గావుత. నేను లేనిసమయమున నాతల్లి కైకవలననైన యీ ఘోరపుఁబనిలో నా కెట్టి సంబంధమున్న, ఈ భూమ్యాకాశములు నసప్పళించి వేయునుగాత. నామస్తకము సహస్రధా భిన్నమై దిగంతముల కొక్కొక్కతునియయై పోవునుగాక" అని దారుణముగాఁ బలికి కన్నీరు నించు చూరకుండెను.

* * * *

అయోధ్యలో దశరథుని కుత్తర క్రియలు చేయుట యొకటి భరతునకు శేషించియుండెను. శోకసముద్రమున

మునిగినవాఁడయ్యెను, బరలోకచింతకలవాఁ డగుటఁజేసి, తన యిమ్మలికమ్మనాఁపికొనివసిష్ఠాదిపురోహితుల పలుకులూఁది యథాశాస్త్రముగ సావధానముగ భరతుఁడు పైతృకక్రియలు నెఱవేర్చెను. పదునాల్గువదివసమున వసిష్ఠాది పురోహితులు భరతుని బట్టాభిషేకముచేసికొమ్మని చెప్పుటకురాజమంత్రుల తోడి యాలోచనలుసల్పి యొక్క పెద్దసభ నేర్పాటుచేసివృద్ధులైనవారెల్ల ననేకవిధముల రాజ్యభారవాహకుఁడవు గమ్మని భరతుని సంప్రార్థించిరి. కాని యామాటలు మన భరతుని చెవి కెక్కినవికావు. జ్యేష్ఠుఁడు రాజ్యమునకు వచ్చుట కులక్రమాగతమైన ధర్మమనియు, శ్రీరాముని వనవాసము పితృనిర్దిష్టమయ్యెను, గైకేయియొక్క వంచనకులోఁబడియాయన కావించిన శాసనముకావున నది కాఁగూఁడదనియు. భరతుఁడొత్తిచెప్పి రఘురాముని మరలఁ బురికిఁ బిలుచుకొనివచ్చుటకుఁ దన కనుజ్ఞయిమ్మని పౌరులనెల్ల వేడుకొనెను. ఈఁవేడికోలునకుఁ బౌరులెట్టి యనుమోదముతో సమ్మతించిరో, భరతుని సౌజన్యమునుగూర్చి వారి కెట్టియభిప్రాయ ముదయించెనో, వ్రాయవలసిన యవసరములేదు. ధర్మదేవతయే భూలోకమున కవతరిల్లెనా? కాక భరతుఁడే మాటలాడుచున్నాఁడా? అరచేతిలోనున్న రాజ్యభోగములఁ బరిత్యజించి, ధర్మాచరణ నిమిత్తము సవతితల్లికొడుకునకుఁ దనసింహాసనము నర్పింపనున్న యీభరతుఁడు మానవుఁడా? కాక దేవుఁడా? సభ్యులు విస్మయార్ణవమున మునింగిరి. వసిష్ఠాదిపురోహితులప్పరమసౌజన్యుని యెదుటనోరెత్తలేక మానుషులైరి బ్రాహ్మ

ణోత్తము లానందాశ్రువులతో పుష్పపూర్వకముగా భరతుఁడు సిద్ధసంకల్పుఁడగును గావుత మని యాశీర్వదించిరి.

భరతుఁడు రాముని నాహ్వానించుటకు సైన్యముతో వెడలవలయునని తలఁచి, అరణ్యమార్గము నెల్లఁ జక్కఁబఱుప నసంఖ్యులైన పనివారిని నియోగించెను. రామదర్శన కుతూహలులు గావున, వారునారాత్రిలోన మార్గము మిఱ్ఱుపల్లములు లేకుండ సైన్యముపోవుటకు వలసైన తెఱంగున బలుపనులొనర్చి సుగమమ్ముగావించిరి. భరతుఁడు తన తల్లులతోడను బురోహితులతోడను రాజమంత్రులతోడను గతిపయసైన్యవర్గముతోడను వెడలి కొంతదూర మరిగి యాపూఁటకు గంగానదీతీరమున శృంగిబేరమను జనస్థానమున నిలిచెను. ఇక్కడ గుహుఁడను నిషాదనేతవలన రామలక్ష్మణులుపోయినమార్గము దెలిసికొని, యాయన సహాయ్యమునఁ బరివారముతోడ జాహ్నవినుత్తరించి మఱునాఁడుభరతుఁడు భరద్వాజునాశ్రమమునకు వచ్చెను. ఈగుహుఁడు దశరథునకుమిత్రుఁడు. సైన్యముతోవచ్చు భరతునిజూచి రాముని వనమునకుఁ దఱిమినది చాలక, యాయన ప్రాణములమీఁది కెత్తివచ్చుచున్నాఁడని తలఁచి యాసుగుణనిధిని బోల్తఁ బలువిధములఁ బరీక్షించి చూచెను. ఆవల యథార్థము తెలిసికొని, గుహుఁడు భరతునకు రామలక్ష్మణుల వృత్తాంతములన్నియుఁ జెప్పెను. ఆనాఁటి రాత్రి రామలక్ష్మణు లెక్కడ నిదురపోయినదియుఁ, దినుటకు నాహారము నెట్లుసంపాదించుకొనినదియుఁ, ద్రావుటకునీ రెక్కడ నుండి తెచ్చుకొన్నదియు, మఱి యేదిక్కునకుఁ బ్రయాణమై

పోయినదియు, నీయుదంతములనెల్ల భరతుఁడు సవిస్తరముగఁ దెలిసికొనెను. రామలక్ష్మణులు పరుండిన స్థలముఁజూచినపుడు భరతునకుఁ గడుపు భగ్గని మండిపోయెను. ఆరాత్రియొక్క యింగుదీతరువుమూలమున దర్భలతోఁ బడక నేర్పఱిచికొని జానకీదేవియు శ్రీరాములు నిద్రించిరి. కొంతదూరమున ధనుర్బాణములు ధరించి లక్ష్మణుఁడు వారిఁగాపాడుచు విశ్రమించి యుండెను. గడ్డిపోఁచలతోఁ గూర్చబడిన యాశయ్యను దన తల్లులకుఁ జూపి భరతుఁ డత్యంతము పరితపించెను.

"ఉ. కంటిరెతల్లులార ! రఘుకాంతుఁడు నాఁటిరాత్రియామ సిందు దీ
కంటకదర్భశయ్యపయిఁ గన్ను మొగిడ్చి శయించె; నల్లవే;
కంటిరె నల్గియున్న యది; కాయదురాపిడిగుర్తు లల్లనే
యంటినఁ గందుమేనఁట ! కుశాస్తరణమ్మఁట ! యేమిచెప్పుదున్

సీ. ప్రాసాదతతుల నుప్పరిగల విహరించి
నట్టిటోఁ డుండెనే చెట్టునీడ !
హైమతలాళి నుద్యానమ్ములం దుండు
ఘనుఁడు చరించెనే కటికినేల !

మలయానిలము వీవఁ దలిరుఁ బాన్పుఁల బండు
ధన్యుఁడు కూర్కెనే దర్భశయ్య !
మంగళధ్వనులు చెలంగ మేల్కొను నృప
వరుఁడు మేల్కొనియె నేవాశితముల !

తే. ప్రోది చిలుకపలుకులు మోదమునను
నినెడి పతి యెట్లు వినియెనో వికటసత్త్వ
బరుషరవములు ! వేనవేల్ ప్రజలుకొల్వ
నుండు నతఁ డెట్టులుండెనో యొంటిలునిచట !

సీ. మొగసురాసేలరో వరహైమరాజత
    ప్రాసాదమందిరా రామ! నీకు
కలికదర్భలప్రోవు నెఱిగిమించు మెత్తని
    పానుపులాయెనా భ్రాత! నీకు
గారవృక్షముకొమ్మలా రాణఁబట్టున
    నల్లిన చందువా యన్న! నీకు
హోరను గాలియే యుగిపెలువీచెడు
    వింజామరల గాలి విభుఁడ! నీకు

తే. వంధిమాగధసంగీత వాద్యగానము
పరుష కాకనినాదమె పరమపురుష!
కనకభూషణరాజినిస్వనము లకట
ఝిల్లికాగణరావమా శ్రీయుతాంగ!

కం. జనకునిసుతయఁట ; దశరథ
జనపతి కోడలఁట ; రామసతియఁట ; ప్రియద
ర్శనయఁట ; యీసీతయుఁ జా
వని నేలను బండె ! నింత పాపముగలదే?

కం. ఇది మాయన్న పరుండిన
యది, శయనము ; కఠినధరణి నటునిటు పొర్లన్
జెదరి నలంగెను బూరియు ;
మృదుతనునకు దర్భశయ్య మేమనవచ్చున్ ?

ఉ. జానకి యుత్తమంబయిన శయ్యయిదే ; యట నామె సొమ్ములన్
మేన ధరించియే బడలి నిద్దురపొందె నటంచుఁ దోఁచెడిన్ ;
మానుగ నీదునందు నవె మంజుల కాంచనసూత్రరేణువుల్
గానఁగనయ్యెడిన్ ; విధినికారము నేమనవచ్చు ? దైవమా !

ఉ. భామిని యుత్తరీయమిటుఁ బట్టుకొనెన్ గనుఁగొంటిరే! కుశ
స్తోమమునన్ దుకూలమున సూక్ష్మపుఁదంతువు లిందు రాజిలెన్ ;
నా మహిసార్వభౌమసతికి న్హంసతూలశయ్యయో సౌఖ్యదాయియౌ
నే మెయినున్న నద్దివగ పేది శయించుట సీత యియ్యెడన్.

చం. కటకట! యెంతపాపుఁడను గష్టపుజీవిని నానిమిత్తమై
కుటిలత రాఘవుండు తనకోమలితో నిటువంటిశయ్యపై
గటికిధరిత్రి దర్భలను గన్ను మొగుడ్చుట గల్గె దిక్కులే
నటు, వెత యింతకన్నఁ గలదా ? తలపోయఁగ గడ్పు భగ్గనెన్.

ఉ. పుట్టెను సార్వభౌమకులమున్ వెలిఁగించుచు ; లోకసమ్మతిన్
బట్టఁగ సర్వలోకహితభావమున్ జయించె నీతికిన్
బట్టయి ; యట్టిసుందరుఁడు పద్మదళాక్షుఁడు రక్తలోచనుం
డిట్టి కఠోరతల్పము పయిన్ బవళింపఁగఁ గల్గె నేమనన్ !

కం. ధన్యుఁడు మహానుభావుఁడు
మాన్యుఁడు సౌమిత్రియే సుమా ! కష్టపథన్
వన్యస్థలి నన్నను సా
జన్యమునన్ వెంటఁగొంటె సమయజ్ఞుండై.

ఆ. ధన్యురాలు సీత ; తనపతితోడుత
వనికి నేఁగెఁ గుతుకమునను సరగ ;
మన కుచేష్టఁ, దలఁప మనల రాముండు ప్ర
సాదదృష్టిఁ గనుట సంశయంబ

ఆ. దశరథుండు విబుధధామంబుఁ జేరుట
రామవిభుఁడు గహనరాజిఁ బడుట
నారకాటిలేమి నల్లాడు నావిక
పోలె ధరణితలము జాలిఁబడియె

ఇది మన్నిత్తమ్మున రఘుకులాలంకారునకుఁ బాటిల్లిన మొదరుగావున,

ఉ. పండెడ నింతనుండి తృణపర్ణచయంబుననొంటె భూమిపై
నొండెడ ; ధరించెదన్ బడల ; నూనెద నారల నెల్లవేళలన్

బండులఁ గందమూలములఁ బ్రాణమునిల్పెదఁ ; దక్క కాలమే
నుండెద పోయి గానవని ; నోరిమి నన్నఁ బ్రతిజ్ఞఁ దీర్చెదన్.

ఉ. ఏలెడుఁగాక రాముఁ డిభుఁ డీయిల లక్ష్మణుతోడ ; నన్నకై
నాలికనాళ్ళ గాననివాసము సేయుదు నాసహోదరుం
డాతని బిన్నతమ్ముఁ ; డటుబ్రాహ్మణ ముఖ్యులయోగ్యులోన సీ
తాలల సేసఁ బట్టము ద్యుమ్నాప్తిగఁ గట్టి సుఖింపరి గాకెడన్

ఉ. దేవతలార ! క్రొంకె చనుదీర్పఁడు నాయభికాంక్షితంబు ; నే
నావిభు రామచంద్రు చరణమ్ముల క్రాలి యనేకరీతులన్
వావిరి వేఁడుకొందు ; రఘునాథుఁడు నామతిఁ బోసఁ జేసి నే
నే నని నుండు నంటు ; నలుఁ డేటికి నన్ను నుపేక్ష సేసెడున్?"

[ఆ. వా. రా.]

భరతుఁడు విషాదభరమున నా రాత్రి యెట్లో గడపి తెల్లవాఱునంతకు గంగానదిని దాఁటి సైన్యము నొక్కచో నిలిపి వసిష్ఠునితో భరద్వాజమహర్షిని దర్శింపఁబోయెను. అక్కడ భరతుఁడు మరల తనయుద్దేశమును దెలిపికొనవలసినవాఁడయ్యెను. కించిద్జ్ఞుఁడు హీనకులుఁడు నీతిమార్గానభిజ్ఞుఁడైన గుహుఁడు సందేహించెఁగాక, యది భరతున కంత విపరీతముగాఁ దోఁపలేదు. కాని సర్వజ్ఞుఁడైన భరద్వాజుఁడు తనపూర్వకోర్కి నందియపడి రాముని యన్నవలను చెప్ప నాలోచించినప్పుడు భరతుఁడు నిశ్చేష్టితుఁడయ్యెను. ఈలోన యున్నరూపు వసిష్ఠుఁడు భరద్వాజున కెఱింగించెను. ఆదిన మెల్ల నచటన యునిచికొని, భరద్వాజుఁడు భరతుని పరివారమునకెల్ల విందుచేసి యనేకములైన యితిహాసములతో భరతునకు నతనితల్లులకును మనస్తాపోపశమనము గావించుచుండెను.

# సప్తమాధ్యాయము

'ఇక్కడికి ౨౪ యోజనములు దూరమునఁ జిత్రకూటమను పర్వతమున్నది. దానికి నుత్తరపుదిశను గంగానది ప్రవహించుచుండును. తత్తీరమునఁ దరులతాసుందరమైన యొక్క వనము కలదు. ఆ శైలమునకును వనమునకును నడుమనున్న యభిరామభూమియే శ్రీరాముఁ డుండుచోటు. దక్షిణముగాఁ గుడితట్టు పోయినయెడల మీకొక్కబాట కాన్పించును. ఆ త్రోవఁబోయిన శ్రీరాముని పర్ణశాల మీకుఁ జూడనగును' అని భరద్వాజమహర్షి గహనమైన యక్కాననప్రదేశమున శ్రీరాముని వెదకుట కనువైనమార్గమును జెప్పివేసెను. భరత శత్రుఘ్నులు తల్లులు వసిష్ఠాదులు తక్కిన సైన్యమును పయనమై యమ్మహారణ్యమునందలి విశేషములు చూచుచుఁ బోవుచుండిరి. వారి కీమహారణ్య మద్భుతాపాదకమై యుండెను వారిదివఱ కెన్నఁడును జూడని వనసత్త్వములు దృగ్గోచరములై యదృశ్యములగుచుండెను. ఒకొక్కయెడ సమీపమునను, ఒకొక్కయెడఁ గొంతదూరమును, ఘోరమైన శబ్దములు వినఁబడుచుండెను. మనుష్యసంచార మెన్నఁడు నెఱుఁగనివి కావున, సామాన్యమైన జంతువర్గములుగూడ వీరిఁజూచి దిక్కుతోఁపక యొక్కచోటనుండి వేఱొక చోటికిఁ బరుగెత్తుచుండెను. సైన్యమువచ్చు రభసమునకు భయపడి యడవియేనుఁగులు తమదంతములతోఁ బ్రక్కనున్న వృక్షములఁ గ్రుమ్ముచు ఘీంకారములు చేయుచుఁ బేరెత్తుచుం

డెను. గుఱ్ఱముల గిట్టలతాఁకునఁ బైకెగసినధూళి యాకాశమును గప్పివైచెను. కంటకపాషాణాదులవలనఁ గొన్నియెడల ముందుకు నడచుటయే దుర్ఘటముగా నుండెను. ఇట్లు కొంత దూరము దక్షిణముగాఁ బోయినతర్వాత నమ్మహారణ్యమున నొక్క రమణీయవనప్రదేశము కన్నులకుఁ బొడకట్టెను. ఆకాశము నంటికొనియుండు వృక్షములుగాని, దారిని నిరోధించు తరుగుల్మలతాదులుగాని లేక యచ్చోటు వాసయోగ్యమైన స్థలమువలెఁ గనఁబడియె. భరతుఁ డక్కడఁ దనపల్లకిదిగి సాధువులైన కొందఱఁ జారుల నియోగించెను. వారు కొంత దూర మరిగి చూడఁగా, దూరమునఁ బొగ లేగుచుండెను. దానినిఁబట్టి మనుష్యసంచార మూహించి యావార్తవారుభరతునకుఁ దెలిపిరి. రామలక్ష్మణుల యాశ్రమమిదియగావలయునని యూహించి సైన్యమునందయుండ నియోగించి 'ఎప్పుడెప్పుడక్కడకుఁ బోనగునా? ఎప్పుడు శ్రీరాముని దర్శింతునా' యని భరతుడు శత్రుఘ్నునితోడ వసిష్ఠునితోడఁ బాదచారియై యాపొగ కనఁబడిన దిక్కునకు వడివడిగాఁ బోవుచుండెను.

మన మిప్పుడు భరతుని నొక్కింత వదలి సీతారామలక్షణులు చిత్రకూటమునొద్ద నేమిచేయుచుండిరో గనుంగొనవలయును.

(స్థానము— శ్రీరాముని పర్ణశాల వెలుపల)

రాముడు:—ప్రేయసీ! నీవు నాతోడ నుండుటఁజేసి, యీ మహారణ్యమే నాకు నందనోద్యానమువలెఁ గన్పట్టుచున్నది. ఆహా! ఈ చందన వృక్షములును, ఈ లవలీ నికుంజములును ఎంత మనోహరములు!

సీత:-నాథా! ఈ తరుపుంజములు సూర్యకిరణములను పూను ముట్టఁ గప్పివేసినను, నిన్నటికన్న నీదినము, ఎండమర్భర ముగానున్నది. మనము మందాకినివైపునకుఁ బోవుదము.

రాముడు:-(నడుచుచు) ప్రాణేశ్వరీ! ఇయ్యడుగుజాడలుచూచి తివా? (నేలవంకఁజూపి) ఇవి యేమని తలంచుచున్నావు?

సీత:-ఇట్టివి మన పర్ణమదావనమున నేనెన్నఁడును జూచినది లేదు. ఇవి యేమై యుండునో?

రాముడు:- ఇవి పెద్దపులిపోయిన యడుగుజాడలు. ఇక్కడఁ బ్రదేశమొకింత యార్ద్రసికతామయముగా నుండుటంబట్టి

సీత:-నాథా పెద్దపులియన్న నా గుండియ లదరుచున్నవి. మొన్న గడ్డిమాటుననుండి మనపై నుఱికిన పులిమాట స్మరించుకొనిన, ఇప్పటికి నాకు భయమగుచున్నది. అప్పుడు లక్ష్మణుఁడు జాగరూకుఁడుగా నుండెఁబట్టి సరి పోయెఁ గాని, లేకయున్న నీపాటికిఁ గైకకోర్కులు ఫలిం చియే యుండును.

రాముడు:-కైక మన కుపకారిణియే యైనది. కాకున్న మన మీయటవీప్రదేశమందలి విశేషములింత యెఱుఁగఁజాలు దుమా! ఋషికులముయొక్క యనుభోగములఁ బ్రత్యక్ష ముగా నిట్లుకన్నులతోఁ జూడఁ గలుగుదుమా?

సీత:-ఆహా! ఇప్పటికి మందాకిని యేఁదినుండి వచ్చు చల్లని పిన్న తెమ్మెరలు మనల సోఁకుచున్నవి. ఈనది యెంత రమణీయముగానున్నది.

చ. వికచసరోజ గర్భమున భృంగము డాఁగుచుమూఁతలాడుఁ బా
యక నిజ కాంతతోడఁ ; గలహంస ముదగ్రతరంగడోల హిం
సికనిడి లయలాఁచుఁ ; గోకిలపుఁజెల్వ దరిక్ష ఫలభ్రమవృక్షశా
ఖికతుది నిల్చి, సీరుకొని ప్రేమ నివేదన కిచ్చుఁ బ్రీతితోఁ.

మన మిక్కడఁ గొంతతడవు ఈఛాయావృక్షములనీడఁ గూరుచుందము.

సీతయు రాముఁడును మందాకినీతీరమునఁ గూర్చుండిరి. కొంతసేపటికి ఉత్తరపు దిక్కున నొక్క కలకలము విన వచ్చెను. అది తొల్త నల్పరూపముగా నుండఁబట్టి వన్యసత్త్వ ముల ఘోషముగాఁ దలంచి శ్రీరాముఁడు తన ధనుర్బాణ ముల సరిపఱిచికొని యూరకుండెను. కాని, యానాదము ప్రతిక్షణ మధిక మగుటఁబట్టియు, ధరాపరాగము మింటికెగ యుటం బట్టియు సైన్యసంచార మూహించి యెవ్వఁడైన ఱేఁడు వేఁటకు రాఁబోలు నసితలఁచి రాముడు కారణ మా రయు మని లక్ష్మణుని నియోగించెను. లక్ష్మణుఁడు పోయి కొంతతడవునకు సత్వరముగాఁ దిరిగి వచ్చి సంభ్రమముతో "అన్నయ్యా! ధనుర్బాణములు ధరించి యుద్ధసన్నద్ధుఁడవు గమ్ము. సీతాదేవిని గుహాలోనికిఁ బొమ్మనుము. మనమీఁది కపారమైన సైన్యముతోడ భరతుఁ డెత్తివచ్చుచున్నాఁడు" అని విన్నవించెను.

రాముఁడు:-భరతుఁడు! భరతుఁడు!!-మన మీఁది కెత్తివచ్చు చున్నాఁడు! నీవు మేల్కొని యున్నావా? లేక కలవ రించుచున్నావా?

లక్ష్మణుఁడు:—నేను మేల్కొనియే యున్నాను, లోకవృత్త మెఱుంగక, కైక కపటమునకులోనై రాజ్యముకోల్పోయిన నీవే కలవరింపవలయు. నీకు సందేహమైన గొంత ముందుకువచ్చి యీ రసాలతరువు నెక్కి యుత్తరుపు వంకఁజూడుము.

రాముడు:—నీవు చూచితివే! నీకేమి కనుపట్టినది?

లక్ష్మణుఁడు:—భరతుని కోవిదార కేతనమును, దానిఁ గాపాడుచుఁ జుట్టుకొనియున్న యనంతసైన్యమును, రథగజతురగపదాతివర్గమును బొడకట్టినవి.

రాముఁడు:— నీకు మనతండ్రి దశరథుని శ్వేతచ్ఛత్రము గనఁబడలేదా?

లక్ష్మణుడు:—లేదు. అదే కలకలము మఱింత దటియుచున్నది. మన కింక వ్యవధానము లేదు, నీవు కవచము దొడిగికొని యుద్ధసన్నద్ధుఁడ వగుటయొండె, భరతుని చేతితోఁ బడుటయొండె శేషించియున్నది.

రాముఁడు:—లక్ష్మణా! నీవు ప్రాజ్ఞుండవయ్యును, వృద్ధసంసేవ లేనివాఁడ వగుటఁజేసి యన్యాయ్యమును దలంచుచున్నావు. ఆభరతుఁడు నీకెన్నఁడేని నెగ్గాచరించెనా? ఏల నీకీ సందియము? మన మడవికివచ్చిన మూఁడుదినములలోన భరతుఁడు క్రొత్తవాఁడయ్యెనా? రాజ్యలోభము నీవివేకమును మ్రింగివేసినది కాఁబోలు. కాకున్న నాప్రియసోదరుఁడు ప్రాణాధికుఁడు నీకంటె నాకు నతిభక్తుఁడైనవాఁడు భరతునితోడఁ బోర నన్నుద్యమింపు

మందువా? ఈ భరతుఁడు మనలఁ జంపుటకు వచ్చుచున్న వాఁడు కాఁడు. రాజగృహమునుండి యయోధ్యకువచ్చి, తానులేనిసమయమునఁ దనతల్లిచేసిన యకృత్యమును దలఁచుకొని మనల మరల నయోధ్యకుఁ దోడ్కొని పోవుటకుఁ బరివారముతోడ వచ్చుచున్నాఁడు. ఐనను, నా మనస్సున కేమోయొక్క యశుభశంకతోఁచుచున్నది. మనతండ్రి యీభరతునితోడ రాకుండునా? వచ్చుచున్న శ్వేతచ్ఛత్రమేలరాదు? ఆయన మనల నెడఁబాపియయోధ్యలో నిల్వఁగలఁడా? మనతండ్రిని గూర్చినే దెట్టి వార్త మనకు వినమన్నదో!

ఇట్లు పలికి శ్రీరాముఁడు తనలో మఱియు నేమేమో తలంచుకొనుచు నప్రయత్నముగఁదన పర్ణశాల వచ్చిచేరెను.

అక్కడ భరతశత్రుఘ్నులును - సుమంత్రుఁడును - గుహుఁడును - పాదచారులై ముందువచ్చుచుండిరి. కొంతదూరమున, వెనుక దశరథుని భార్యలును, వసిష్ఠుఁడును, వారివెనుకఁ దక్క సైన్యమును వచ్చుచుండెను. ధూమమును జూచి యాశ్రమస్థలము దగ్గఱిదని యనుకొనిరిగాని, యెంత దూరము నడచినను వారికి శ్రీరామపాదవిన్యాస ధన్యమైన ధరణీతలము కనుపట్టకుండెను. కఠినములైన శిలలును గంటకములును త్రోవ నావరించుకొనియుండెను. అప్పటికి మధ్యాహ్నము కావచ్చుచుండెను చండకిరణుఁడా కాశమధ్యమునకు

వచ్చి దుర్నిరీక్ష్యమైన తేజస్సుతో భూమివంకఁ జూచు చుండెను. కౌసల్య మొదలగువారు పాదచారిణులే యైరో గాక పల్లకీలలోనే వచ్చుచుండిరో తెలియదు. చిత్రకూట పర్వతములోని రాలవలని సెగ దుర్భరమైనందున, వన్యసత్త్వములు చెట్లమాటునకుఁ బోవుచు నీళ్ళదరుల నారయుచుఁ జెరలాడుచుండెను. భరతుఁడు ముందునడచుచుండెను. వెనుక శత్రుఘ్నుఁడును గుహసుమంత్రులును వచ్చుచుండిరి. ఇట్లు నడచునెడ, వారికిఁ గొన్నికడలఁ జెట్లకుఁ గట్టియున్న గుడ్డపేలికలు కనఁబడెను. అవి యాశ్రమవాసు లడవిలోఁద్రోవ తప్పకుండఁ దమకుటీరముల వలను గనుఁగొనుట కేర్పఱచు కొన్న సంకేతములుగా వా రూహించిరి. హోమధూమము నిబిడమై యాశ్రమముయొక్క సామీప్యమున వెల్వరించు చుండెను. కొంతదూరము నడవఁగా, వారికిఁ జెట్లమాటు తొలఁగియొక్కయాకుటిల్లు పొడకట్టెను. అప్పుడు భరతుఁడు శత్రుఘ్నునితో 'తమ్ముఁడా! మనకు భరద్వాజమహర్షి సూచించిన యశ్రమ ప్రదేశ మిదియె. నానిమిత్తమై శ్రీరాముఁ డీ ఘోరారణ్యమున నివసించుట తలఁచుకొన్న నాబుద్ధి నన్ను విడనాడిపోవుచున్నది. నాకళ్ళు వడఁకుచున్నవి. నేను నడవఁజాల. నన్ను గట్టిగాఁ బట్టుకొనుము' అని చెప్పుచు వారు ముందుకు నడిచి పర్ణశాలయొక్క పురోభాగమునకు వచ్చిరి.

శ్రీరాముఁడు పర్ణశాలకు వెలుపల నొక్కదర్భసంస్తరణమ్మునిూఁదఁ గూరుచుండియుండెను. జానకీదేవి ప్రక్క నొదిఁగి నిలిచియుండెను. శిరస్సున జటాకలాపముతో నారవస్త్రములు కట్టుకొని కృష్ణాజిన మొత్తరీయముగా ధూళిధూసరితవేషముతో నివురుకప్పిన నిప్పువలెనున్న యన్నను గుఱితించి భరతశత్రుఘ్నులు పరువెత్తికొనిపోయి 'అన్నా!' యని పాదములపైఁ బడిరి. అప్పుడు భరతుని చిత్తవృత్తి యెట్లుండెనో యూహించికొనవలయుఁగాని వ్రాయనలవికాదు. కన్నెత్తిచూచి యేమో మాటలాడఁ బ్రయత్నించెను గాని, 'అన్నా' యనుటతక్క భరతుఁడు రెండవమాట మాటాడలేక పోయెను. కన్నుల నూరక నీరు వెడలుచుండెను. అప్పుడు శ్రీరాముఁడు వారల లేవనెత్తి కౌఁగిలించుకొని శాంతవచనములతో వారికలఁకఁబాపి ప్రక్కఁగూర్చుండఁబెట్టుకొని, "తమ్ములార! ఏలయీదుర్గమాటవులకువచ్చితిరి? అయోధ్యలో నాయనకు నేమమా? వృద్ధరాజునువిడిచి మీరిట్లు రాఁజెల్లునా? మద్వియోగదుఃఖమున ననరుచున్న నాయనకుఁ గన్నులయెదుట మీరైన నుండఁగూడదయ్యెనా? మీరాకకు తల్లులు సమ్మతించిరే?" యనునంతకు భరతుఁడు దశరథుని మరణవార్తయుఁ దాను దల్లులతోను బౌరులతోను వచ్చినపనియు నన్నకుఁ జెప్పివేసెను.

"తరల. నినుఁ దలంచియ యేడ్చుచున్ మఱి నీదు దర్శనకాంక్షియై
నినుఁ దలంగక యున్నబుద్ధని నేర సేమియుఁ ద్రిప్పఁగా

అనఘ! నీవిడనాడుటన్ భవదార్తిపీడితుఁడౌచు నీ
జనకుఁడకట! యస్తమించెను జాల నిన్నె స్మరించుచున్!"

రామలక్ష్మణుల మొదలంట నఱకఁబడిన కదళీతరువులవలె నేల కొఱిగిరి.

"సముఖముననుండి పితృకార్యములు నెఱవేర్చిన మీరు ధన్యులరు గదా! నాయట్టి నిర్భాగ్యుఁ డుండియేమి, లేకుండియేమి? అక్కటా? మధ్యమలోకము నిరస్త ప్రకాశమే యయ్యెనా? లక్ష్మణా! మనకింక దిక్కెవ్వరు? ఆహా! యెట్టిదుర్దినము" అని రాముఁడు శోకభరమ్మునఁ బెక్కువగలఁబెద్దయుం బ్రొద్దువగచి మరల ధైర్యముఁదెచ్చుకొని తమ్ములతోడ జానకితోడ మందాకినీతీరమునకుఁ బోయి యక్కడఁ గావలయు పితృకార్యము లాచరించెను. ఈలోనకౌసల్యాదులు తల్లులును వసిష్ఠుఁడును పౌరులును నందఱు వీరిని గలసికొనిరి. అప్పుడు స్నానమాడి తడిసిన నారచీరలతో విరియఁబడిన జటాబంధములతో నీరు కాఱుచుండఁ దమపాదములకుఁ బ్రణామిల్లిన కొడుకుగోడండ్రఁ జూచి కౌశల్యాసుమిత్రల హృదయము లేమైయుండునో యెవ్వఁడు వర్ణింపగలఁడు?

# అష్టమాధ్యాయము

ఆ రాత్రియెల్ల శోకమయమై గడచిపోయెను. మఱునాటి దినము కర్తవ్యాంశములు నివేదించువాఁడై భరతుఁడు శ్రీరాముని బురికి రాకతప్పదని తీవరింపసాగెను.

రాముఁడు:—వత్సా! నీకోర్కె కొనసాగునదికాదు. పితృనాజ్ఞ యెల్లవిధములననుల్లంఘనీయము. సామ్రాజ్యసింహాసనమున నునుచుట కెట్టియధికారము కలదో, తండ్రికి నన్ను వనవాసమున కనుచుటకు నట్టియధికారము కలదు. ఆయనకోర్కె మేరకుఁ బదునాల్గేఁడు లరణ్యవాసము సల్పి ఈవల నయోధ్యకు మరలివచ్చెద.

భరతుఁడు:—ఇది, యాయనకోర్కెయేయైన, నేను జెప్పునది యేమియునులేదు. నాతల్లి కైకవలననైన తంత్రమునకు లోఁబడి యాయన కావించినశాసనము గావున.

రాముఁడు:—ఎట్టిదైనను, తండ్రియాజ్ఞ యాజ్ఞయే. తల్లికిఁ గూడఁ బ్రీతికరము కావుటంబట్టి, ఈ వనవాసము నాకెక్కువగా నుపాదేయమగుచున్నది.

భరతుఁడు:—విపరీతబుద్ధియైయెట్లో యనర్థమును వేఁడెఁగాక, నాతల్లి పశ్చాత్తప్తయై నిన్నుఁ బురమునకుఁ దోడ్కొని పోవ వచ్చియున్నది. ఆమెయొక్కయుఁ, దక్కిన తల్లుల యొక్కయు మాటలు నీకు గ్రాహ్యములుగావా?

రాముఁడు:—అవును; ఐనను నాకుఁ జరమోక్తిగాఁ దండ్రి విధించిన వనవాస మవశ్యకర్తవ్యమని తోఁచుచున్నది. ఆయనమాటలనే నేయుల్లంఘించితినేని, లోకమునఁ బితృ నాజ్ఞ పరిపాలించువాఁడెవ్వఁడుండును? నన్నీయుద్యమము నుండి మరల్పరాదు. ఈపదునాల్గేఁడులును క్షణముఁబోలెఁ గడపి వనవాసాంతమున నేను మిమ్మయోధ్యలోఁ గలసి కొనెద.

భరతుఁడు:—సర్వజ్ఞుఁడవగు నీకడనేఁ జెప్పవలసిన దేదియును లేదు. మనవంశమున-మనవంశమన నేల? సకలరాజవంశ ములను-జ్యేష్ఠుఁడు రాజ్యసింహాసనమునకు వచ్చుట సనా తనమైన యాచారముగా నున్నది. ధురావహానసమర్థులైన మీరిర్వురును దొలఁగించుకొని, రాజ్యభారమును నాపైఁ బెట్టినకతన, ఈ రాజ్యమున కెట్టిగతి పట్టునో చెప్పరాదు. రాజుబలహీనుఁడైన సామంతులు నీతిమార్గమును దప్పె దురు. ప్రజాక్షోభమును, అవినీతియుఁ బ్రజ్వరిల్లును. వర్ణ సంకరము వాటిల్లును. ఇన్ని యనర్థముల కాస్పదమైనయీ వనవాసమునకుఁ బరాఙ్ముఖుఁడవగుటనీకుఁ బరమధర్మము. తండ్రియాజ్ఞ యవశ్యకర్తవ్యమేని ఆ వనవాసము నీకు బదులు నేనాచరించి తండ్రిని సత్యవాక్యుని గావించెదను.

వసిష్ఠుఁడును రాముఁడు మరలి పురమునకువచ్చుటకను కూలములైన పూర్వరాజర్షి చరిత్రములఁ బెక్కింటి నుదాహ

రించెను. తల్లులు వాత్సల్యపూర్వకముగా వేఁడికొనిరి. ఎన్నియైనను, శ్రీరాముని మనస్సు దిరుగదయ్యె. ధార్మికులు దృఢమనస్కులుగదా! అప్పుడు భరతుఁడు చేయునదిలేక, రాముని ప్రవాసకాలమున సింహాసనమధిరోహింపఁ దన కిష్టములేమిం జేసి యాయన తొడిగికొనియున్న పాదుకలు తనకిమ్మని వేఁడుకొని రామునితో,

"అన్నయ్యా! నీవెక్కవలసిన సింహాసనమును నిర్భాగ్యుఁడు-ఈభరతుఁ డధిరోహించువాఁడుగాఁడు. నీవులేనికాలమున నీపాదుకలే యీరాజ్యభారమును వహింపఁగలవు. నేను రాజ్యకార్యముల నీపాదుకలకు వినిపించుచు, నీవలెనే జటాధారినై యయోధ్యాపట్టణములోని కడుగుపెట్టక సకలభోగవర్జనుఁడనై దినములు లెక్కపెట్టుకొనుచు నెందేనిఁ గాలమ్ముగడపెదను. పదునాల్గవసంవత్సరము తుదిని నీవు రావేని, నీపాదములు సాక్షిగా- ఈనాతల్లుల పాదములసాక్షిగా-అగ్నిప్రవేశము గావించెదను" అని ఘోరప్రతిజ్ఞ గావించెను. ఈ యన్నదమ్ముల సంభాషణములు వినుచున్న యాశ్రిమవాసులు భరతుని చిత్తశుద్ధిని భ్రాతృభక్తికిని వెఱఁగుపడిరి. అదృశ్యులై యాకాశమున విమానముల నిలిచి యీభాషణముల నాలించుచున్న బర్హిర్ముఖులు, రావణవధకుఁ బూర్వరంగము నిరంతరాయముగా నేర్పడినదిగదా యని లోలోన సంతోషపడుచు యథేచ్ఛముగాఁ బోయిరి.

*   *   *   *

భరతుని చిత్తవృత్తి గాలిలోని దీపకళికవలె నల్లలాడుచుండెను. అయోధ్యనుండి వచ్చునపుడు భరతునకు శ్రీరాముని మరలఁ దోడ్కొనిపోవచ్చునని కొండంత యాశయుండెను. అది నేఁడు విఫలమైపోయినది. ఎవ్వఁడు తనతండ్రి తర్వాతఁ దనకు పూజనీయుఁడో, యెవ్వని బాల్యమునుండి తన ప్రాణములకన్న నధికముగఁ బ్రేమించెనో, యెవ్వని సౌజన్యమునుగూర్చి తా వెఱఁగుపడుచుండెనో, యెవ్వని బలపరాక్రమాదులు రాజ్యాధికారవహనమునకుఁ బరమసమర్థుఁడని బోధించుచుండెనో, యెవ్వని సుకుమారాకార ముత్తమభోగయోగ్యమై వనవాసానర్హతను బ్రతిక్షణము ప్రతిబోధించుచుండెనో, అట్టి యగ్రజుఁడు. అట్టి సుగుణరాశి, అట్టి మహాపరాక్రమశీలుఁడు, అట్టిశ్రీరాముఁడు జానకీసహితుఁడై యరణ్యమున నగచాట్లు పడుచుండఁగాఁ దానెట్లు పురికిఁ బోగలఁడు? వీరచటనుండుట తన వనవాసనియమమునకు భంగకరమని శ్రీరాముఁడు వీరిఁ బురికిఁబొమ్మని వేగిరింపఁ దొడఁగెను. కావున వసిష్ఠానుమతిని వార లారాత్రి వేకువఁ బయనమైరి. అప్పుడు కొనయాసయు వదలుకొని కొడుకు గోడండ్రఁ బదునాల్గేండ్ల వనవాసమున కప్పగించి మరలుచున్న కౌసల్యచిత్తములో నివిషాదమునుజొచ్చిచూడవలయుఁగాని వర్ణిపనలవికాదు. శ్రీరాముని దోడ్కొని పోవుటకుఁగాఁ దెచ్చిన పట్టంపుటేనుఁగుపైఁ బాదుకలుపెట్టి భరతశత్రు

ఘ్నులు పాదచారులై వచ్చుచుండిరి. తక్కినవారు వారి ననుగమించుచుండిరి. వారు భరద్వాజాశ్రమముచేరి యా మహర్షికి జరిగిన వృత్తాంతములు విన్నవించి కొంత విశ్రమించి యావల నయోధ్యకుఁ బైనమైరి.

రాముఁడరణ్యావాసము మానుకొనిన వార్త యయోధ్యలో నల్లుకొనిపోయెను పౌరులువిన్నఁదనముదోఁపు మోములతో నీదుర్వార్త నొకరితోనొకరు చెప్పుకొనుచుండిరి. చంద నక్షత్రశూన్యమైన వియన్మండలమువలెఁ గాంతిహీనమైన యయోధ్యాపట్టణమును భరతుఁడు చూడ నొల్లకుండెను. కాని తల్లులనచటఁ జేర్పవలసియున్నందున, రాజవీథినుజ్జగించి యొకత్రోవను బురప్రవేశముగావించి, సింహసంచారములేని గిరికందరములవలెనున్న రాజభవనములఁ దనతల్లుల నునిచి యాపూఁటనే ప్రక్కఁ దూర్పుననున్న యొకపల్లియ (నందిగ్రామము) లో నుండితాను రాజకార్యముల నెఱవేర్చుటకుఁ దగిన యేర్పాటులెల్లఁ గావించుకొనెను. కతిపయమంత్రివర్గముతో బయలుదేరి, యయోధ్యలో జలప్రాశనమైనఁ జేయక, శ్రీరాముని పాదుకలు శిరమునధరించి పాదచారియై రాజవీథిని బోవుచున్న భరతునిఁజూచి పౌరు లద్భుతవిషాదభరితులైరి.

# నవమాధ్యాయము

భరతుఁడు నందిగ్రామమునఁ బాదుకాముఖమున రాజకార్యములు నిర్వర్తించుచుండెను. ఆతఁడు సూర్యోదయమునకు మున్న నిద్రలేచి క్షత్త్రియోచితములైన కల్యకర్మముల నాచరించి ౮,౯ గంటలకుఁ బాదుకాధిష్ఠితమైన సింహాసనము నొద్దకు వచ్చెడువాఁడు. అక్కడఁ దన దర్శనమునకు వేచియున్న సామంతులకును, ఇతరజనులకును దర్శనమిచ్చి పాదుకలు ప్రమాణముగాఁ దనయంతరాత్మ కెవ్వి శాస్త్రవిహితములని తోఁచునో యట్టియాజ్ఞలఁ బ్రతిపాదించి మధ్యాహ్నమునకు లోని కేఁగెడివాఁడు. అప్పుడు క్షున్నివృత్తికొఱకైన యల్పఫలమూలముల భుజించి తక్కుకాలము పూర్వరాజర్షి చరిత్రములు వినుటయందును, వేదశాస్త్రపురాణప్రసంగములయందును వృద్ధజనులతోడఁ గాలమ్ము గడుపుచుండెను. భ్రాతృవిరహదుఃఖమువలనఁ గలిగిన శరీరవైవర్ణ్యమునకుఁ దోడు జటాధారణాదులవలననైన మార్పువలన భరతుని గుఱుతించుటయే యసాధ్యముగా నుండెను. అల్పాహారము వలనను, ఎన్నఁడు నలవాటులేని యితర వ్రతచర్యలవలనను ప్రకృతి సుకుమారుఁడైన భరతుఁడు కృశించి తొల్తశల్యావశిష్టుఁడైనప్పుడు, ఈ నియమములు మార్చుకొనుమని మిత్త్రులు పెక్కుతెఱఁగుల బోధించిరి. కాని, రామునితోడి పునస్సమాగమ మగునంతదనుక నీనియమములవలన నేమైన నగుఁగాక వానిఁ ద్యజింపవలనుపడదనియు, రాజ్యాధికార

యోగ్యుఁడైన యగ్రజుఁ డరణ్యమునఁ దపోవృత్తినుండఁ దాను భోగానుభవము సేయుట గురుద్రోహమనియుఁ జెప్పి భరతుఁడు తనపట్టు వీడకుండెను. భరతుని యుల్లాసముకొఱకు సామంతులు నాటకాదులు నృత్యాదులు పెక్కులు కల్పించుచుండిరి. కాని తాను రాజుగాఁడనియుఁ బాదుకలు కార్యనిర్వహణము సేయుచున్నవనియుఁ జెప్పి తాను, అట్టివాని దర్శింపకుండెను. సుఖహేతువులైన వస్తుదర్శనములుగూడ భరతునకుఁ జింతనే గావించుచుండెను 'జానకీసహితుఁడైన రామునకుండవలసిన యీ భోగములు నాకేల? ఆయన పాదధూళి ధరించుటకుఁగూడ నేనర్హుఁడనుగాను' అని భరతుఁడు చెప్పుచుండెను. అట్టి మహనీయుని సాన్నిధ్యమున రాష్ట్రమెల్ల ధర్మమయమై పోయెను. అహింసాపరులయిన మహర్షుల యాశ్రమములఁ గ్రూరసత్త్వములు జాతివైరమును దక్కి కరుణకలిగియుండునని మనము విందుముగదా! భరత రాజ్యమున నట్టిదియే ఘటిల్లెను. చోరులు దొంగతనము మానుకొనిరి. జారత్వ మనునది దుష్కావ్యాలాపముల యందుఁ జూడవలసినదే. స్వప్రయోజనపరత్వము నామమాత్రావశేషమయ్యెను. రాజభక్తిమిన్నందెను. 'భరతుని యాజ్ఞ' యన్నఁజాలును. అది బ్రహ్మాస్త్రమే. ధర్మము యొక్క శక్తి యప్రతిద్వంద్వ మని యెల్లరకుఁ దోఁచిపోయెను. వర్ణాశ్రమాచారములు, గురుదేవతాభక్తి, వేదవిశ్వాసము, అన్నియును బ్రస్ఫుటము లయ్యెను. ఇఁక సామంతరాజులు భరతుఁడన్న భగవచ్ఛబ్దమునకుఁ బర్యాయపదమని వాడుకొనఁజొచ్చిరి. పుణ్యతీర్థావగాహమునకన్నఁ, బుణ్యక్షేత్ర

దర్శనముకన్న భరతుని జూచుట యెక్కువఫల మిచ్చునది యని ప్రజలు దలంపఁ దొడఁగిరి. దండనీతితోఁ బనియే లేక పోయెను. ధర్మాతిక్రమణ మసాధ్య మయ్యెను.

భరతుఁడు నందిగ్రామమున రాజ్యము చేయుచుండెను తొల్తటి విషాదవేగము కాలక్రమమునఁ గొంత తగ్గినను రామసందర్శనేచ్ఛ భరతుని మనస్సున విడనాడక తాండవ మాడుచుండెను. 'అరణ్యవాస మెప్పుడు పూర్తియగునా? శ్రీరాముఁ డయోధ్యకు మరల నెప్పుడు వచ్చునా? చతురంగ బలకోశవసుధాన్యములతోడ నేనీ రాజ్యము నాయన కెప్పు డప్పగింపఁ గలుగుదునా?' యనిభరతుఁడు దినములు లెక్క పెట్టుకొనుచుండెను. ఐన నొక్క దినమా? రెండు దినములా? పదునాలుగేండ్లు గడవవలయు!

చిత్రకూటమునుండి మరలివచ్చిన కొన్ని దినముల వఱకు భరతునకు శ్రీరాములవార్త తెలియుచుండెను. ఆవల వార్తలువచ్చుటుడిగెను. ఆరణ్యకుల నెవ్వరి నడిగినను వారు చెప్పనేరకుండిరి. రామలక్ష్మణులే దిక్కునకేఁగిరో, యేమైరో యెవ్వరికిని దెలియకుండెను. వారు దండకారణ్యము ప్రవేశించినదిగాని, పంచవటికి వచ్చి యక్కడ శ్రీరాముఁడు సీతను గోల్పోయినదిగాని, పాపము! భరతున కేదియుఁ దెలియదు. సీతా నిమిత్తమై రామరావణులకుఁ బాటిల్లిన ఘోర సంగ్రామముగాని, యందు హనుమదాదిసహాయ్యమున శ్రీరామున కొడఁగూడిన జయముగాని, సీతాపరీక్షణము పరిగ్రహముగాని భరతునకు నేమియుఁ దెలియదు, యదార్థము

లైన యిట్టి యుదంతములు దెలియకున్నను, శ్రీరాముఁడు సముద్రమును దాటి రావణునితోడి యుద్ధమున నుపక్రమించిన తర్వాత నపకారతత్పరులైన రక్కసులు కొన్ని మాయలుపన్ని భరతునకు సంశయ విషాదముల వెలయించుచుండిరి. ఒకపరి, దండశూకుఁ డను రాక్షసుఁడు మునివేషధారియై వచ్చి లక్ష్మణుఁ డరణ్యమునఁ గ్రూరసత్త్వముల పాలయ్యె నని చెప్పి మిక్కిలి యలజడి కలిగించెను. వేఱొక్కపరి, ఇంకొక్కఁడు శ్రీరాముఁడు రావణాసురునిచేత హతుఁ డయ్యెనని నమ్మకము పుట్టఁ బల్కి భరతునిఁ బ్రాయోపవేశము సేయింప నుద్యమించెను. ఇట్టి రాక్షసమాయలు దైవానుకూల్యమున బయల్పడి కార్యము మించుటకున్న మాయావులైన యచ్చెనటి రక్కసులే ప్రమందుచుండిరి ౧౦ సంవత్సరములు- ౧౧ సంవత్సరములు-శ్రీరాములవార్త దెలియకుండెను. పాపము! మన భరతుఁ డేమి సేయగలఁడు? పదునాల్గవ సంవత్సరముగూడఁ గడచిక్కుచుండెను. రామలక్ష్మణుల జోబడి లేదు. అరణ్యములలో సంచరించునపుడు సింహశార్దూలముల పాలైరో, పిశితాశనుల చేతులనే పడిరో, ప్రవాహములు వనవహ్ని ఇత్యాదిసందర్భములనే చిక్కుకొనిరో, ఈపదునాల్గేండ్లలో జానకీసహితులైన రామలక్ష్మణు లెట్లయిరో యని భరతునకుఁ జింత యపారమయ్యెను. పదునాలుగేండ్లకు శ్రీరాముఁడు మరలివచ్చునని యనుకొనుచున్న భరతునియాశ వ్యర్థమే యయ్యెనా? ఆయన వారి యరిష్టనివృత్తికై నందిగ్రామమునఁ గావించుచున్న శాంతిక్రియలు నీటనే గలసెనా?

ఒక్కనాఁటి సాయంసమయమున సంధ్యాకార్యములు దీర్చి భరతుఁడు వసిష్ఠాదిసహితుఁడైన యగ్నిసాన్నిధ్యమునఁ గూరుచుండి యుపనిషత్తులు చెప్పుచున్న బ్రాహ్మణులతోడ నర్థవిచారము చేయుచుండెను. వేదపఠనానంతరము బ్రాహ్మణులు పోఁగా, భరతుఁ డీశ్వరాధ్యానతత్పరుఁడై కొంతతడవు కన్నులు మూసికొని కూరుచుండెను. "శ్రీరాముఁడు క్షేమముగా నున్నాఁడు. జానకీసహితుఁడై లక్ష్మణునితోడ లంక నుండి పుష్పకవిమానమున వచ్చి భరద్వాజాశ్రమమున నుండి యీ శుభవార్త ముందుగా మీకుఁ దెల్పుటకు నన్నంపినాఁడు" అను మాటలు భరతునకు శ్రుతిగోచరములయ్యెను. 'ఇదియేమి స్వప్నమా? కాక మనోవికారమా?' యని భరతుఁడు కన్నులు దెఱచి చూచునంతకు తనయెదుట మేరుపర్వతమువలెఁ బచ్చని కమనీయవిగ్రహమును, మిక్కిలి యెఱ్ఱవాఱిన నెమ్మొగమ్మును, పింగనేత్రములును వెలుఁగ బ్రహ్మవర్చస్వియైన యొక కపిశ్రేష్ఠుఁడు పొడకట్టి "నేను హనుమంతుఁ డనువాఁడను, వాయుదేవుని కుమారుఁడను, శ్రీరాముని దాసుఁడను, నేను మాయావులైన రక్కసులలో నొక్కరుఁడగాను, అట్టివారెల్ల లంకలోనే నిహతులైరి. నన్ను సంశయింపకుము" అని తన్నుఁ దానెఱింగించుకొని శ్రీరాముఁడు చిత్రకూటము వదలినదిమొదలు. అంతవఱకు జరిగిన విశేషముల నన్నిటిఁ బూసకూర్చినట్లు భరతునకుఁ జెప్పెను. భరతుఁడు ముహూర్తమాత్ర మానందముచేతఁ బరవశుఁడై యేమియుఁ దోఁప కూరకుండెను. "వానరోత్తమా! ఇట్టి శుభవార్త దెచ్చి నాప్రాణములు నిల్పిన నీ

మేలునకుఁ బ్రతిక్రియ చేయఁజాలనని దోఁచుచున్నది. స్వామి భక్తిభరితుఁడవైన నిన్నుఁ జూచుటచే నాజన్మము సఫలమైనది." యని యాంజనేయుని కౌఁగిలించుకొని సత్కరించి యందఱ కెఱిఁగించి భరతుఁడు సపౌరపరివారముగాఁ దల్లులతోడఁ దమ్మునితోడఁ బురోహితులతోడ రాముని సందర్శింపఁ బోవుటకు బయలుదేరెను. అంతలోన శత్రుఘ్నుఁడయోధ్యాపట్టణము నపూర్వశృంగారకలితమ్ముగా నలంకరింప, నందిగ్రామమునుండి యయోధ్యకుఁ బోవుమార్గము నత్యంత సుగమమ్ముఁ గావింపఁ దగువారి నాజ్ఞాపించెను.

భరతాదులు వాలుకినదియొద్దకుఁ బోవునంతకు వానరులు గోమతీతీరమును దాటియుండిరి. పైకుణములోన శ్రీరాముని పుష్పకము మెల్లరకు దృగ్గోచరమయ్యెను. అప్పుడు వనవాసదీక్షఁ జేసి గుఱితింపరాకయున్న రామలక్ష్మణులను, సీతాదేవిని, బూర్వపరిచయము లేకునికి నజ్ఞాతులై యున్న సుగ్రీవవిభీషణాదులను హనుమంతుఁడు పేరుపేర భరతునకుఁ గౌసల్యాదులకును జూపి యొక్క పెట్టున శ్రీరాముని విమానము నొద్దకుఁ బోయి భరతాదులు వచ్చియున్నారని విన్నవించెను. పుష్పకము ధరణీతలమునకు దిగియెను. అప్పుడు రథముడిగ్గి తలఁదాల్చుకొని తెచ్చుచున్న పాదుకలను బట్టి గుఱితింపఁ గలిగెఁగాని లేకున్న శ్రీరాముఁడు భరతుని గుఱితింపనేనేరఁడు కట్టుకొనియున్న కృష్ణాజినములు, ధూళిధూస

రితములైన మేనులు, వ్రేలాడు జడలు, కృశాంగములునై తాపసవేషములతో దూరమునుండి వచ్చుచున్న తమ్ములను జూచి శ్రీరామునకే యాశ్చర్యము కలిగెను. కౌసల్యాదులును గలిసికొనిరి. ఈ సమాగమమున నన్నదమ్ములకును, తల్లులకును, పౌరులకును, ఎల్లరకుఁ గలిగిన మహోల్లాసము వర్ణనాతీతమైయుండెను. దశరథుఁడు లేని కొఱంత యొక్కటి యుండఁబట్టి సరిపోయెగాక లేకున్న నియ్యనిర్వాచ్య మహానంద సముద్రమగ్నులైన వీరేమైయుందురో !

భరతుఁడు పాదుకలు రాముని కాళ్లఁదొడిగి "నృపోత్తమా! నీయాజ్ఞఁజేసి నీకు భృత్యుండనై యీ పదునాలుగేండ్లు రాజ్యభారము వహించితిని. నిన్నీయయోధ్యాపట్టణమునఁ గలసికొని, యీ రాష్ట్రమును మరల నీకప్పగింపఁగలుగుటఁ జేసి నాజన్మము సఫలమైనది. నేఁ గృతార్థుఁడను. మాతల్లి కైకయొక్క కోర్కెయు, నటుపై నాసంప్రార్థనమును నీవాచరించుటచేత మాకు మఱవరాని మహాగౌరవము నాపాదించితివి. ఇంతకన్న నేను గోరఁదగిన యభ్యుదయ మేమియును లేదు" అని చెప్పి నమస్కరించెను. దేవతలు కుసుమవృష్టిఁ గురిసిరి. ఆవల నందఱును నందిగ్రామమునకుఁబోయి యక్కడ నలుగురుకుమారులును దీక్షావిసర్జనము గావించుకొని, సముచిత వసనభూషణాదులు ధరించి, నూత్నశృంగారకలితమైన సీతాదేవితో సకలపరిజనముతో నయోధ్యాపట్ట

ణము చేరి యక్కడ నపూర్వవిభవముతో - అమరావతీపట్ట
ణమునందు దేవేంద్రుఁడువలె—వసిష్ఠాది మహామునులచేత
శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁ డయ్యెను.

---

## ఉపసంహారము.

చ. కరగతమైన రాజ్యరమఁ గానుకగాఁ గొన కార్యధర్మ ను
స్థిరత నఖండసంపదలు జ్యేష్ఠునకిచ్చె; నతం డయోధ్యకున్
మరలెడు నంత కుగ్రనియమమ్ములఁ బుచ్చెఁ జతుర్దశాబ్దముల్;
భరతుని సత్ప్రవర్తనము పాఠకులారా! తలంచి చూడుఁడీ.

చ. ఎఱుఁగమె తోడబుట్టువుల నెందఱినో సహజార్థధర్మముల్
జెఱచినవారి! స్వార్థరతిచేఁ గపటాత్మకు లైనవారి; న
త్తెఱఁగునఁగాక సర్వజగతీస్పృహణీయచరిత్రుం డైన యీ
భరతుని మర్త్యమాత్రుఁ డనవచ్చునె? దేవుఁడ యంట పొచ్చెమే ?

సీ. తనకు రాజ్యముగూర్పఁ దల్లి గావించిన
కుటిలతంత్రమున కీకొనఁగలేదు ;
అవల వసిష్ఠాదు లర్థవాదము లాడ
వెసఁ దదుక్తులు చెవిఁబెట్టలేదు;
అడవి శ్రీరాముండె యాదేశ మిడ రాజ్య
మింపారఁగొన నిచ్చగింపలేదు;
కడువిరాగులనైన మడికించు నల దురా
శాపిశాచికిఁ జో టొసంగలేదు;

తే. ధర్మనిష్ఠాభిరతియు, సోదరజనైక
పరతయును దోఁపఁ గార్యముల్ జరిపినాఁడు;
ధరణిరాజ్యమ్ము తృణమట్లు దలఁచినాఁడు;
భరతునకు సాటి యన్యుఁ డొక్కరుఁడు గలఁడె ?

సీ. [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

తే. భా[illegible]
సిరి మగలుగొల్పు [illegible]
అన్న కమృతమ్ము [illegible]
ధర[illegible]

చ. ఎదుటన యుండె రాముఁ, డతని చిత్రము లక్ష్మణుండు వె-
[illegible]దవు వ్రతంబు సల్పెనన? యెందును భ్రాతృసహస్రములు గాఁ
బదియును నాలుగేడులు తపం బొనరించె నితం డయోధ్యలో;
[illegible]దురితశీలుఁ డీభరతు నట్టియనఘులు నగ్గిరే యొకఁడైన?

మ. కలరో, గాక యథార్థమో, యొకఁడయినన్ గాకుత్స్థచారిత్ర మం
చితమై యొందఱి సీతలన్ భరతులన్ శ్రీరాములం గూర్చె భా
రత వర్షమ్మునఁ; దావృతాశయమహాగ్రంథైక విగ్నతన్
నతి గావించెదఁ బట్టువుట్టువునకున్ జ్ఞానైకవారాశికిన్.

సంపూర్ణము